RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

సంచిక : 12 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శుక్రవారం | 15-05-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00

**నీలగిరి నిత్యపద్యం**

ఆటవెలది

ధనముగలిగియున్న ధరణిన జూడగా
వెంబడించు జనులు వేలకొలది
మంచితనము మరియు
మానవత్వమునున్న
వెంటనుండి కాచు వేల్పు మనల

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



## తెలంగాణలో.. నిప్పుల సెగలు

- 45 డిగ్రీల కన్నా ఎక్కువ ఉష్ణోగ్రతలు
- ఉత్తర తెలంగాణలో మూడు రోజులు రెడ్ అలర్ట్
- పగటి వేళ బయటకు రావద్దన్న అధికారులు

హైదరాబాద్, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
ఉత్తర తెలంగాణకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. మూడు రోజుల పాటు ఉత్తర తెలంగాణలో ఎండలు తీవ్రరూపం దాల్చనున్నట్లు ప్రకటించింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలకు అలర్ట్ జారీ చేసింది. ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్‌ను దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ మూడు రోజులు వడగాలుల ప్రభావం కూడా తీవ్రంగా ఉండనుందని తెలిపింది. ఎండల తీవ్ర నేపథ్యంతో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించింది.

-మిగతా 2 లో

## మోడీ సర్కార్ ఫెయిల్


**నీట్-యూజీ2026 రద్దు... మోడీ ప్రభుత్వ నియంతృత్వ... నిరంకుశ నిర్ణయం**



- మోడీ హయాంలోనే 93 పేపర్లు లీక్
- పేపర్ లీక్ జరిగితే కనీసం సంబంధిత మంత్రిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు
- ఆందోళనలో రెండు కోట్ల మంది విద్యార్థులు
- కేంద్రం తీరుపై ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి ఆగ్రహం

హైదరాబాద్, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
నీట్-యూజీ2026 రద్దు... మోడీ ప్రభుత్వ నియంతృత్వ... నిరంకుశ నిర్ణయమని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విమర్శించారు. కేంద్ర ప్రభుత్వఏకపక్షరద్దుతో యువత భవితవ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. గతపదేండ్లుగాప్రధాని మోడీ హయాంలో93పేపర్లు లీక్ అయ్యాయని ఆగ్రహంవ్యక్తం చేశారు. దీంతో రెండు కోట్ల మంది విద్యార్థులు ఆందోళన చెందుతు న్నారని అన్నారు. పేపర్ లీక్ జరిగితే కనీసం సంబంధిత మంత్రిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని ముఖ్యమంత్రి విమర్శించారు. నీట్ రద్దు.. దేశ ప్రజలను తీవ్ర దిగ్భ్రాంరతికి గురి చేసిన పెద్ద నోట్ల రద్దు వంటిదేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వ అనాలోచిత, నిర్లక్ష్యపూరితమైన ఈ నిర్ణయం దేశ యువత భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిందన్నారు. వ్యవస్థీకృతంగా

-మిగతా 2 లో



## పొదుపు చర్యలకు దిగిన ఢిల్లీ ప్రభుత్వం

- వారానికి రెండు రోజులు వర్క్ ఫ్రమ్ హోమ్
- వారానికి ఒకరోజు నో వెహికిల్ డే
- సిఎం రేఖాగుప్తా పలు నిర్ణయాలు ప్రకటన

న్యూఢిల్లీ,
దేశవ్యాప్తంగా ఇంధన పొదుపు, పర్యావరణ పరిరక్షణ, ప్రజా రవాణా వినియోగంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ ప్రభుత్వం కూడా కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన పొదుపు సూత్రాల పిలుపు మేరకు ఢిల్లీ ప్రభుత్వం పలు సంస్కరణాత్మక చర్యలను ప్రకటించింది. ముఖ్యమంత్రి రేఖాగుప్తా ఆధ్వర్యంలో తీసుకున్న ఈ నిర్ణయాలు ప్రభుత్వ ఖర్చులు తగ్గించడం, ఇంధన వినియోగ నియంత్రణ, ప్రజా రవాణా ప్రోత్సాహంపై కేంద్రీకృతమై ఉన్నాయి. ట్రాఫిక్ రద్దీ తగ్గించడం, ఇంధన వినియోగాన్ని నియంత్రించడం లక్ష్యంగా ఢిల్లీ ప్రభుత్వం ఉద్యోగులకు వారానికి రెండు రోజులు వర్క్ ఫ్రం హోమ్ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం రేపటి నుంచే అమల్లోకి వస్తుందని సీఎం రేఖా గుప్తా ఆదేశాలు జారీ చేశారు. ఈ విధానం వల్ల

-మిగతా 2 లో

## బండి భగీరథ్ ముందస్తు బెయిల్.. వారం రోజులకు వాయిదా



2 లో



## కేరళ సీఎంగా వీడీ సతీశన్

- 10 రోజుల ఉత్కంఠకు తెర
- 18న ప్రమాణ స్వీకారం
- వేణుగోపాల్ వర్గం అసంతృప్తి

న్యూఢిల్లీ,
కేరళ తదుపరి ముఖ్యమంత్రిగా వీడీ సతీశన్ పేరును కాంగ్రెస్ పార్టీ గురువారం ప్రకటించింది. దీంతో గత కొన్ని రోజులుగా నెలకొన్న ఉత్కంఠ, ఊహాగానాలకు తెరపడింది. ముఖ్యమంత్రిగా ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన సతీశన్ ఎంపికను ఏఐసీసీ కేరళ ఇన్‌చార్జ్ దీపా దాస్‌మున్షీ, రాష్ట్రం కోసం పార్టీ నియమించిన కేంద్ర పరిశీలకులు అజయ్ మాకెన్, ముకుల్ వాస్నిక్ విలేకరుల సమావేశంలో ప్రకటించారు. సతీశన్ ఈ నెల 18న ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయనున్నారు. ముఖ్యమంత్రి పదవి కోసం వీడీ సతీశన్, కేసీ వేణుగోపాల్, రమేశ్ చెన్నితల పోటీపడ్డారు. ఈ సందర్భంగా సతీశన్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భారీ విజయం సాధించడంలో ఏఐసీసీ యత్నాలను సమన్వయం చేసి పార్టీ కార్యకలాపాలన్నింటికీ మద్దతు ఇచ్చిన కాంగ్రెస్

-మిగతా 2 లో

## నేటి నుంచి ప్రధాని ఐదు దేశాల పర్యటన

- హరిత ఇంధనం నుండి సెమీకండక్టర్ల వరకు.. ఒప్పంద అవకాశాలు
- ప్రధాని పర్యటన భారతీయ ఎగుమతులకు వ్యూహాత్మక మలుపు కానుందన్న ఎఫ్ఐఈఓ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ: మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మే 15 నుండి 20 వరకు చేపట్టనున్న ఐదు దేశాల పర్యటనకు ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్స్ పూర్తి మద్దతు ప్రకటించింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అనిశ్చితి నెలకొన్న ప్రస్తుత తరుణంలో, ఈ పర్యటన భారతీయ

-మిగతా 2 లో



## ఆదా చేద్దాం.. ఇంధనం!

**ప్రధాని బాటలో ఏపీ, తెలంగాణ సీఎంలు**

### పొదుపు మంత్రం పాటిస్తున్న ముఖ్యమంత్రులు

- కాన్వాయ్‌లలో కోత విధించిన చంద్రబాబు, రేవంత్
- మంత్రులకు సైతం వాహనాలు కట్
- ప్రభుత్వ ఉద్యోగులకు వాహన షేరింగ్ ప్రతిపాదన
- పగటిపూట ఏసీలు కట్.. సోలార్ పవర్‌కు ప్రాధాన్యం
- వాహనశ్రేణిలో విద్యుత్ వాహనాలపై మొగ్గు

పశ్చిమాసియాలో చోటుచేసుకున్న ఉద్రిక్తతలు, అంతర్జాతీయంగా ఇంధన ధరల పెరుగుదల నేపథ్యంలో దేశంలో పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఈ క్రమంలో దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఇంధన పొదుపు చర్యలను చేపట్టడంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు అడుగులు వేస్తున్నారు. సామాన్య ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండటంతో పాటు ప్రభుత్వ ఖర్చులను తగ్గించడమే లక్ష్యంగా ఈ కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

2 లో





## మూడో దశ 'సర్' షెడ్యూల్ విడుదల

- తెలంగాణ, ఏపీతో పాటు 16 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రక్రియ
- తెలంగాణ, పంజాబ్‌లో ఒకేసారి 'సర్' ప్రారంభం

న్యూఢిల్లీ
మూడో దశ స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్(సర్)కు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. తెలంగాణ, ఏపీతో పాటు 16 రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత పాంత్రాల్లో ఈ ప్రక్రియ చేపట్టనున్నట్టు తెలిపింది. ఈ మేరకు గురువారం కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటన విడుదల చేసింది. మొత్తం ఎనిమిది విడతల్లో ఈ మూడో దశ 'ఎస్ఐఆర్'ను నిర్వహించనున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు తెలంగాణ, ఏపీతో పాటు ఒడిశా, మిజోరాం, సిక్కిం, మణిపూర్, దాద్రానగర్ హవేలీ, ఉత్తరాఖండ్, అరుణాచల్ ప్రదేశ్, హర్యానా, చండీగఢ్, పంజాబ్, కర్నాటక, మహారాష్ట్ర, జార్ఖండ్, మేఘాలయ, ఢిల్లీ, నాగాలాండ్, త్రిపుర ఉన్నాయి. ఇందుకోసం 3.92 లక్షల మందికిపైగా బూత్ స్థాయి అధికారులు (బీఎలఓలు) 36.73 కోట్ల మంది ఓటర్ల వద్దకు వెళ్లనున్నారు. వీరికి లెక్కింపు దశలో రాజకీయ పార్టీలచే నియమించబడిన మరో 3

-మిగతా 2 లో

## ఇంటర్ విద్యా విధానంలో మార్పులు

- ఫస్టియర్ నుంచే ప్రాక్టికల్ పరీక్షలు
- మార్పులకు సిద్ధం అవుతున్న బోర్డు




హైదరాబాద్, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
ఇంటర్ విద్యా విధానంలో తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యామండలి కీలక మార్పులు చేపట్టేందుకు సిద్ధమైంది. 2026-27 విద్యా సంవత్సరం నుంచి కొత్త విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. విద్యార్థుల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్, కాన్సెప్ట్ ఆధారిత అభ్యాసం పెంచడమే లక్ష్యంగా ఈ మార్పులు చేసింది. కొత్త విధానంలో సైన్స్, మ్యాథ్స్, భాషా విభాగాల్లో పరీక్షల సరళి, మార్కుల విధానం, ప్రాక్టికల్స్ నిర్వహణలో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఇప్పటి వరకు ఇంటర్ సెకండియర్‌లో మాత్రమే ప్రాక్టికల్స్ నిర్వహించగా,

-మిగతా 2 లో

## మరోమారు తెరపైకి ఫార్ములా-ఈ రేస్ కేసు

- కేటీఆర్ తదితరులకు ఎసిబి నోటీసులు
- జూలై 31న విచారనకు రావాలని ఆదేశాలు

హైదరాబాద్ మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
తెలంగాణలో సంచలనం రేపిన ఫార్ములా-ఈ రేస్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు పలువురు కీలక అధికారులకు ఏసీబీ ప్రత్యేక కోర్టు సమన్లు జారీ చేసింది. జూలై 31వ తేదీన విచారణకు వ్యక్తిగతంగా హాజరు కావాలని కోర్టు ఆదేశాలు జారీ చేయడంతో రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి నోటీసులు జారీ చేసింది. ఫార్ములా ఈ-కార్ రేసు కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌కు

-మిగతా 2 లో



## తెలంగాణలో.. నిప్పుల సెగలు

మొదటి తరువాయి

అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని వాతావరణ శాఖ తెలిపింది. బయటకు వెళ్లవలసి వస్తే తప్పనిసరిగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచనలు జారీ చేసింది. ఎండల తీవ్రత కారణంగా ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

## పొదుపు చర్యలకు దిగిన ఢిల్లీ ప్రభుత్వం

మొదటి తరువాయి

ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే వాహనాల సంఖ్య తగ్గి, కాలుష్య నియంత్రణకు తోడ్పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వ ఖర్చులు తగ్గించడంలో భాగంగా సీఎం కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను నాలుగుకు పరిమితం చేశారు. ఇందులో రెండు ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించాలని నిర్ణయించారు. ప్రజలకు ఆదర్శంగా నిలవాలనే ఉద్దేశంతో ఈ చర్యలు చేపట్టినట్లు ప్రభుత్వం తెలిపింది.
పౌరుల్లో దేశభక్తి, సామాజిక బాధ్యత పెంపొందించే లక్ష్యంతో 'నా భారతదేశం ? నా కర్తవ్యం' పేరుతో ప్రత్యేక ఉద్యమాన్ని ఢిల్లీ ప్రభుత్వం ప్రారంభించింది. ఈ కార్యక్రమం 90 రోజుల పాటు కొనసాగనుంది.ఇంధన పొదుపు, ప్రజా రవాణా వినియోగం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ ఉద్యమం ప్రధాన లక్ష్యం. ప్రభుత్వ ఉద్యోగులు, మంత్రులు, ఉన్నతాధికారులు ప్రతి సోమవారం తప్పనిసరిగా ఢిల్లీ మెట్రోలోనే ప్రయాణించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీనిని 'మండే మెట్రో' పేరుతో ప్రత్యేక కార్యక్రమంగా అమలు చేయనున్నారు. ఈ నిర్ణయం ద్వారా ప్రజారవాణా వినియోగాన్ని ప్రోత్సహించడమే కాకుండా, ట్రాఫిక్ రద్దీ తగ్గించాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోంది. సామాన్య ప్రజలు కూడా వారంలో కనీసం ఒక రోజైనా 'నో వెహికిల్ డే' పాటించాలని ప్రభుత్వం సూచించింది. వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించి, సైకిళ్లు, మెట్రో, బస్సులు వంటి పర్యావరణహిత రవాణా మార్గాలను వినియోగించాలని కోరింది. ప్రభుత్వ శాఖలు వచ్చే ఆరు నెలల వరకు పెట్రోల్, డీజిల్, ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలు చేయొద్దని ప్రభుత్వం నిర్ణయించింది. అవసరమైతే ఇప్పటికే ఉన్న వాహనాలనే వినియోగించాలని ఆదేశాలు జారీ చేసింది. ఇది ప్రభుత్వ ఖర్చులను తగ్గించడమే కాకుండా, వనరుల సమర్థ వినియోగానికి దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్‌ను 10 శాతం పెంచుతూ ఢిల్లీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రజా రవాణా వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ఈ చర్య తీసుకున్నట్లు తెలిపింది. ప్రభుత్వ వ్యయ నియంత్రణలో భాగంగా వచ్చే ఏడాది వరకు అన్ని విదేశీ అధికారిక పర్యటనలను పూర్తిగా రద్దు చేశారు. అత్యవసర పరిస్థితులు మినహా విదేశీ ప్రయాణాలకు అనుమతి ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఢిల్లీ ఇప్పటికే వాయు కాలుష్య సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు పర్యావరణ పరిరక్షణకు కీలకంగా మారే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వర్క్ ఫ్రం హోమ్, మెట్రో వినియోగం, నో వెహికిల్ డే వంటి చర్యలతో వాహనాల సంఖ్య తగ్గి కాలుష్యం నియంత్రణలోకి వచ్చే అవకాశముందని భావిస్తున్నారు.

## కేరళ సీఎంగా వీడీ సతీశన్

మొదటి తరువాయి

ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌కు ధన్యవాదాలు తెలిపారు.ప్రచార కమిటీ చైర్మన్‌గా పనిచేసిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రమేశ్ చెన్నితలకు కూడా ఆయన ధన్యవాదాలు తెలిపారు. పార్టీ విజయంలో పోషించిన పాత్రను ప్రస్తుతిస్తూ ఆయన నా నాయకుడు కూడా అని అన్నారు. ముఖ్యమంత్రి పదవిని సాధించడంలో సహాయపడిన లక్షలాదిమంది పార్టీ కార్యకర్తలకు, యూడీఎఫ్ సంకీర్ణ భాగస్వాములకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. తమ నాయకుడిని సీఎంగా ప్రకటించకపోవడంపై కేసీ వేణుగోపాల్ వర్గీయులు అసంతృప్తిని వ్యక్తం చేశారు. కాగా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ దాదాపు 40 నిమిషాలపాటు సమావేశమైన మరుసటి రోజు కేరళ ముఖ్యమంత్రి ప్రకటన వెలువడింది. పార్టీ అధిష్టాన వర్గం చర్చలు పూర్తి చేసినట్లు బుధవారం కాంగ్రెస్ ప్రకటించింది. మే 4న కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ 140 స్థానాలకు గాను 102 స్థానాలను కైవసం చేసుకున్నప్పటి నుంచి కేరళ తదుపరి ముఖ్యమంత్రిపై నిర్ణయం పెండింగ్‌లో ఉంది. పార్టీ పరిశీలకులు మాకెన్, వాస్నిక్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కలసి వారి అభిప్రాయాలను సేకరించిన తర్వాత కూడా రోజుల తరబడి అనిశ్చితి కొనసాగడంతో పార్టీ కేంద్ర నాయకత్వం విస్తృత సంప్రదింపులు జరిపింది. పార్టీ నాయకత్వం ఆ పదవికి పోటీపడుతున్న ముగ్గురు ప్రధాన అభ్యర్థులతోపాటు కేపీసీసీ అధ్యక్షుడు సన్నీ జోసెఫ్‌తో కూడా చర్చలు జరిపింది. సతీశన్, వేణుగోపాల్, చెన్నితలకు మద్దతు ఇచ్చే వర్గాల మధ్య అంతర్గత పోటీ కారణంగా కేరళలో కాంగ్రెస్ విజయం మరుగున పడింది. ముఖ్యమంత్రి పేరును ప్రకటించడంలో జరుగుతున్న జాప్యం పార్టీ కార్యకర్తలతోపాటు సంకీర్ణ భాగస్వామ్య పక్షాలలో కూడా ఆందోళన రేకెత్తించింది.

## మూడో దశ 'సర్' షెడ్యూల్ విడుదల

మొదటి తరువాయి


.42 లక్షల బూత్ లెవల్ ఏజెంట్లు(బీఎలఏలు) సహాయంగా నిలవనున్నారు. అయితే ఈ ప్రక్రియకు సహకరిస్తూ... తమ పార్టీల నుంచి బీఎలఏలను నియమించాలని రాజకీయ పార్టీలను ఈసీ కోరింది. తొలి రెండు దశల్లో 13 రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాల్లో జరిగిన సర్ ప్రక్రియలో దాదాపు 59 కోట్ల మంది ఓటర్లను చేరినట్లు వెల్లడించింది. ఈ ప్రక్రియ కోసం 9.2 లక్షలకుపైగా బీఎలఏలు పలు రాజకీయ పార్టీల నుంచి పాలుపంచుకున్నట్లు తెలిపింది. కాగా దేశవ్యాప్త జనగణనలో ఇండ్ల జాబితా ప్రక్రియ, యంత్రాంగాన్ని దఅష్టిలో పెట్టుకొని హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, లఢక్‌లకు ఈ మూడో దశ నుంచి మినహాయింపు ఇచ్చినట్లు పేర్కొంది. ఈ మూడు రాష్ట్రాలు/యూటీల్లో స్థానికంగా ఉండే చల్లని వాతావరణం, ఎత్తైన ప్రాంతాలను దఅష్టిలో పెట్టుకొని సర్ షెడ్యూల్‌ను ప్రకటిస్తామని తెలిపింది.

**తెలంగాణ, పంజాబ్‌లో ఒకేసారి 'సర్' ప్రారంభం**

తెలంగాణతో పాటు పంజాబ్‌లో ఒకేసారి ఈ ఎసఐఆర్ ప్రకియ ప్రారంభించనున్నట్టు ఈసీ వెల్లడించింది. ప్రస్తుతం తెలంగాణలో మే12 నాటికి 3,39,20,705 మంది ఓటర్లు ఉన్నట్టు తెలిపింది. వీరిని చేరేందుకు 35,985 మంది బీఎలఓలు, 25,886 మంది బీఎలఏల సహాయం తీసుకోనున్నట్టు పేర్కొంది. కాగా ఈ సిబ్బందికి జూన్ 15 నుంచి 24 వరకు శిక్షణ ఇవ్వనున్నారు. జూన్ 25 నుంచి జులై 24 వరకు ఇంటింటి సర్వే చేపడతారు. ఆ తరువాత జులై 31న ఓటర్ల ముసాయిదా జాబితాను ప్రకటించి, అదే రోజు నుంచి సెప్టెంబర్ 28 వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నారు. చివరగా అక్టోబర్ 1న తుది ఓటరు జాబితాను ఈసీ ప్రకటించనుంది.

## బండి భగీరథ్ ముందస్తు బెయిల్.. వారం రోజులకు వాయిదా

**హైదరాబాద్**



కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పై హైదరాబాద్ లోని పేట్ బషీర్‌బాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం భగీరథ్ హైకోర్టును ఆశ్రయించాడు. గురువారం (మే 14) హైకోర్టులో ఈ పిటిషన్ పై విచారణ జరగగా.. భగీరథ్ తరుఫున ప్రముఖ లాయర్ నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు. వాదనాలు విన్న న్యాయస్థానం వారం రోజులకు వాయిదా వేసింది. మధ్యంతర బెయిల్ పిటిషన్ పై శుక్రవారం (మే 15) విచారణ చేపడతామని పేర్కొంది. బాధితురాలు పుట్టిన రోజు డేట్స్‌పై, గతంలో రాష్ డ్రైవింగ్ కేసులో అమ్మాయి మేజర్ అని పోలీసులు ఫైల్ చేసిన ఛార్జ్ షీట్ పట్ల పోలీసులు విచారణ జరపాలని హైకోర్టు ఆదేశించింది. వీటి ఆధారంగా నిర్ణయం తీసుకుంటామని పేర్కొంది. అయితే, ముందస్తు బెయిల్ వచ్చే వరకు అరెస్ట్ చేయకుండా మధ్యంతర ఆదేశాలు ఇవ్వాలని భగీరథ్ తరుపు లాయర్ కోరగా.. మధ్యంతర బెయిల్?పై శుక్రవారం (మే 15) విచారణ చేపడతామని హైకోర్టు స్పష్టం చేసింది.


# మోడీ సర్కార్ ఫెయిల్

మొదటి తరువాయి

పేపర్ లీక్‌లు, ప్రభుత్వ వైఫల్యాలు దేశ యువతను తీవ్ర అనిశ్చితి, నిరాశలోకి నెట్టాయని చెప్పారు. తీవ్ర ఒత్తిడిలో సంవత్సరాల తరబడి కష్టపడి చదువుకున్న విద్యార్థుల కలలు మోడీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం కల్లలయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంతోమంది విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి, కొంతమంది పేరెంట్స్ నగలు అమ్మి తమపిల్లలనునీట్ ఎగ్జామ్ కు ప్రిపేర్ చేయించారని... వారి ఆశలన్నీగల్లంతవడంబాధాకరమన్నారు. 2019 నుండి 15 రాష్ట్రాల్లో ప్రధాన నియామక పరీక్షల పేపర్లు లీక్ అయినా, ఒక్క కేంద్ర మంత్రి కూడా రాజీనామా చేయలేదని గుర్తు చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాలే ఈ లీక్‌లకు ప్రధాన కేంద్రాలుగా మారాయని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. గుజరాత్ రాష్ట్రంలోనే 14 పేపర్లు లీక్ అయ్యాయన్నారు. 2014 మే నెలలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి, భారతదేశంలోని ప్రభుత్వ పరీక్షా వ్యవస్థలో వ్యవస్థీకృత లోపాలు బహిర్గతమయ్యాయని చెప్పారు. కాంగ్రెస్ విడుదల చేసిన 'ది పేపర్ లీక్ డెకేడ్' శ్వేతపత్రం ప్రకారం, కేంద్ర, రాష్ట్ర పరీక్షలలో 93 పేపర్ లీక్ ఘటనలుజరిగాయని ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. వీటివల్ల సుమారు 2 కోట్ల మంది విద్యార్థులు ప్రభావితమయ్యారని చెప్పారు. 2024లో కేవలం ఎనిమిది వారాల్లోనే నాలుగు ప్రధాన జాతీయ పరీక్షలు రద్దయ్యాయని తెలిపారు. నీట్-యూజీ (24 లక్షల మంది అభ్యర్థులు), యుజిసి-నెట్ (9 లక్షలు), సిఎస్ఐఆర్-నెట్, నీట్-పిజిరద్దుఅయినట్టు గుర్తు చేశారు. 2024లో ఉత్తరప్రదేశ్ పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష (16 లక్షల మంది మహిళలతో సహా 48 లక్షల మంది అభ్యర్థులు) కూడా కొన్ని రోజుల్లోనే రద్దైందని, ప్రధాని సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో 14 ప్రధాన లీక్‌లు జరిగాయన్నారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, హర్యానా వంటి ఇతర బీజేపీ పాలిత రాష్ట్రాలు కూడా ఈ కుంభకోణాల జాబితాలో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం 2024 ఫిబ్రవరిలో 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (తప్పుడు మార్గాల నివారణ) చట్టం'ను ఆమోదించినప్పటికీ, పెద్ద కుంభకోణాలు వెలుగు చూసిన తర్వాత, 2024 జూన్ వరకు దాని నోటిఫికేషన్‌ను కేంద్రం ఆలస్యం చేసిందన్నారు. కాగా, తెలంగాణ ముఖ్యమంత్రిగా, విద్యార్థులకు, తల్లిదండ్రులకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక హామీ ఇచ్చారు. నీట్రద్దునేపథ్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దనిభరోసానిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి విద్యార్థికి, వారి కుటుంబానికి అండగా నిలుస్తుందని హామీనిచ్చారు.

## ఇంటర్ విద్యా విధానంలో మార్పులు

మొదటి తరువాయి




కొత్త విధానంలో ఇంటర్ ఫస్టియర్ నుంచే ప్రాక్టికల్స్ ప్రవేశపెట్టనున్నారు. ప్రత్యేకంగా ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ విభాగాల్లో ఫస్టియర్ విద్యార్థులకు కూడా ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. కొత్త విధానం ప్రకారం.. ఇంటర్ ఫస్టియర్‌లో, సెకండియర్‌లో 15 మార్కుల చొప్పున ప్రాక్టికల్స్ నిర్వహించనుంది. దీంతో విద్యార్థులు కేవలం థియరీకే పరిమితం కాకుండా ప్రయోగాత్మక పరిజ్ఞానాన్ని కూడా అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుంది. మ్యాథమేటిక్స్ బోధనలోనూ కీలక మార్పులు తీసుకురానుంది. సంప్రదాయ పద్ధతికి బదులుగా యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌ను అమలు చేయనుంది. దీంతో విద్యార్థులు సూత్రాలను అర్థం చేసుకోవడం, సమస్య పరిష్కార నైపుణ్యాలు పెంపొందించుకోవడం, కాన్సెప్ట్ ఆధారిత విద్యనభ్యసించడం వంటి ప్రయోజనాలు పొందే అవకాశం ఉంది. ప్రస్తుతం మ్యాథ్స్‌లో 75 మార్కులకు ÷నైల్ పరీక్ష నిర్వహిస్తుండగా, కొత్త విధానంలో దాన్ని 60 మార్కులకు తగ్గించనుంది. అదేవిధంగా యాక్టివిటీలు, ఇంటర్నల్ అసెస్‌మెంట్‌కు ప్రాధాన్యం పెంచే అవకాశం ఉంది.
ఇప్పటివరకు ఇంటర్ పరీక్షలు 100 మార్కులకు నిర్వహించగా, ఇకపై వాటిని 80 మార్కులకు నిర్వహించనున్నట్లు సమాచారం. మిగిలిన మార్కులను ఇంటర్నల్ అసెస్‌మెంట్ ప్రాక్టికల్స్, యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్ ద్వారా కేటాయించే అవకాశం ఉంది. తెలుగు, ఇంగ్లీష్, హిందీ వంటి భాషా విభాగాల్లో 20 మార్కులను ఇంటర్నల్ అసెస్‌మెంట్‌కు కేటాయించనుంది. ఇందులో ప్రాజెక్టులు సెమినార్లు, అసైన్‌మెంట్లు, క్లాస్‌రూమ్ పనితీరు ఆధారంగా మార్కులు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఈ కొత్త విధానంతో విద్యార్థులపై పరీక్షల ఒత్తిడి కొంతమేర తగ్గే అవకాశం ఉందని విద్యా నిపుణులు భావిస్తున్నారు. ఒక్క ÷నైల్ పరీక్ష ఆధారంగా కాకుండా, ఏడాది పొడవునా విద్యార్థుల పనితీరును అంచనా వేసే విధానం అమల్లోకి రానుంది. ఈ సంస్కరణలు జాతీయ విద్యా విధానం(ఔఇఖ)కు అనుగుణంగా తీసుకువస్తున్నట్లు సమాచారం. విద్యార్థుల్లో సృజనాత్మకత, విశ్లేషణాత్మక ఆలోచన, ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందించడమే ప్రధాన లక్ష్యంగా విద్యా నిపుణులు పేర్కొంటున్నారు. ఇంటర్ విద్యా విధానంలో వస్తున్న ఈ మార్పులు విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

## నేటి నుంచి ప్రధాని ఐదు దేశాల పర్యటన

మొదటి తరువాయి



ఎగుమతులకు ఒక వ్యూహాత్మక మలుపు కానుందని ఎఫ్ ఐఈఓ అధ్యక్షుడు ఎస్.సి. రల్హాన్ అభివర్ణించారు.మే 15 న ప్రారంభమయ్యే ఈ పర్యటన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), నెదర్లాండ్స్, స్వీడన్, నార్వే, ఇటలీ దేశాల్లో సాగనుంది. ఈ ఐదు దేశాలతో భారతదేశానికి సమిష్టిగా 70 బిలియన్ డాలర్లకు పైగా ద్వైపాక్షిక వాణిజ్యం ముడిపడి ఉందని ఎస్.సి. రల్హాన్ పేర్కొన్నారు. ఇటీవల ముగిసిన భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం, భారత్-ఈఎఫ్టీఏ వాణిజ్య ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం నేపథ్యంలో ఈ పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.ఇది భారతీయ ఎగుమతిదారులకు సాంప్రదాయ రంగాలు మాత్రమే కాకుండా.. గ్రీన్ హైడ్రోజన్, సెమీకండక్టర్లు, రక్షణ తయారీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ వాణిజ్యంలి వంటి అత్యాధునిక రంగాలలో అరుదైన అవకాశాలను కల్పిస్తుందని అంచనా వేస్తున్నారు.
**యూఏఈతో** భారతదేశ సంబంధాలు సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంగా మారాయి. మధ్యప్రాచ్యం, ఆఫ్రికా మార్కెట్లకు ఈ గల్ఫ్ దేశం భారతదేశానికి ఒక ముఖ్యమైన ముఖద్వారంగా పనిచేస్తోంది. ఈ పర్యటన ద్వారా ఇంధనం, మౌలిక సదుపాయాలు, సేవల వాణిజ్యంలో పెట్టుబడులు మరింత పటిష్టం కానున్నాయి.
**నెదర్లాండ్స్,** ఇటలీలి దేశాలతో క్లీన్ టెక్నాలజీస్, బ్లూ ఎకానమీ మరియు స్థిరమైన సప్లై చైన్ ఏర్పాటుపై చర్చలు జరగనున్నాయి. ఇది ఫార్మాస్యూటికల్స్, టెక్స్టైల్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు మేలు చేస్తుంది.
**ఓస్లో (నార్వే)** లో జరిగే భారత్-నార్డిక్ శిఖరాగ్ర సదస్సు పునరుత్పాదక ఇంధనం, వాతావరణ సాంకేతికతలు, సముద్ర రంగాలలో పరస్పర సహకారానికి ఒక అద్భుతమైన వేదిక కానుంది.'యూరోపియన్ రౌండ్ టేబుల్ ఫర్ ఇండస్ట్రీ' లో ప్రధాని పాల్గొనడం పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచుతుంది. ఎఫ్ ఐఈఓ ఈ పర్యటనను ఒక సువర్ణావకాశంగా పేర్కొంది.

## మరోమారు తెరపైకి ఫార్ములా-ఈ రేస్ కేసు

మొదటి తరువాయి

ఏసీబీ కోర్టు సమన్లు జారీ చేసింది. ఆయనతో పాటు ఏ2గా ఉన్న ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్, ఏ3 హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, ఏ4 స్పోర్ట్స్ కన్‌స్టలెంట్ కిరణ్ మల్లేశ్వర్‌రావుకు సమన్లు జారీ అయ్యాయి. జులై 31న విచారణకు రావాలని కోర్టు ఆదేశించింది. 2023లో నిర్వహించిన ఫార్ములా ఈ-కార్ రేసు కేసులో నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సంస్థకు రూ.55 కోట్లు మళ్లించినట్లు ఏసీబీ అభియోగపత్రంలో పేర్కొంది. ఇప్పటికే ఈ కేసులో కేటీఆర్, అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలతో సహా ఎఫ్ఈఓ సంస్థ ప్రతినిధులను ప్రశ్నించింది. ఫార్ములా-ఈ కారు రేసు నిర్వహణలో జరిగిన అక్రమాలపై ఏసీబీ ఇప్పటికే లోతైన దర్యాప్తు జరిపి అభియోగపత్రాన్ని దాఖలు చేసింది. ఈ కేసులో ఏ1గా కేటీఆర్, ఏ2గా మాజీ అధికారి అరవింద్ కుమార్, ఏ3గా బీఎల్ఎన్ రెడ్డిలను ఏసీబీ పేర్కొంది. వీరితో పాటు ఏ4గా స్పోర్ట్స్ కన్‌స్టలెంట్ కిరణ్ మల్లేశ్వర్ రావు, ఏ5గా ఎఫ్ఈఓ సంస్థపై కేసులు నమోదయ్యాయి. 2023లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములా-ఈ రేసు కోసం నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సంస్థకు నిధులు మళ్లించారన్నదే ప్రధాన అభియోగం. హెచ్ఎండీఏ ఖాతా నుంచి సుమారు 55 కోట్ల రూపాయలను ఎఫ్ఈఓ సంస్థకు బదిలీ చేసినట్లు ఏసీబీ ప్రాథమికంగా గుర్తించింది. ముందస్తు అనుమతులు లేకుండానే ఇంత భారీ మొత్తాన్ని విదేశీ సంస్థకు ఎలా చెల్లించారన్న కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.ఇప్పటికే ఈ కేసులో కేటీఆర్, అరవింద్ కుమార్ సహా పలువురు ప్రతినిధులను ఏసీబీ అధికారులు ప్రశ్నించారు. తాజాగా ఏసీబీ కోర్టు ఈ కేసును విచారణకు స్వీకరించి సమన్లు జారీ చేయడంతో.. జూలై 31న కోర్టులో ఏం జరగబోతుందనేది ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠ రేపుతోంది.

## ఆదా చేద్దాం.. ఇంధనం!

మొదటి తరువాయి

ఆంధ్రప్రదేశ్‌లో సగానికి తగ్గుతున్న కాన్వాయ్‌లు..
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తమ భద్రతా వాహనాల శ్రేణిని (కాన్వాయ్) గణనీయంగా తగ్గించుకోవాలని నిర్ణయించారు. సాధారణంగా ముఖ్యమంత్రులు, మంత్రులు పర్యటించే సమయంలో పెద్ద సంఖ్యలో వాహనాలు వెంట రావడం సహజం. అయితే ఇకపై జిల్లాల్లో పర్యటించేటప్పుడు తమ కాన్వాయ్‌లలో ఉండే వాహనాల సంఖ్యను 50 శాతానికి తగ్గించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.
కేవలం వీరు మాత్రమే కాకుండా, మంత్రులు, ఇతర వీవీఐపీలు కూడా సాధ్యమైనంత తక్కువ వాహనాలను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇక ప్రభుత్వ కార్యాలయాల్లో పగటి సమయంలో ఏసీలు వేయరాదని ఆదేశాలిచ్చారు. సోలార్ పవర్‌తో నడిచే కార్యాలయాలకు మినహాయింపు ఇచ్చారు. ఇక ఉన్నతస్థాయి ఉద్యోగులు షేరింగ్ కార్లను మాత్రమే వినియోగించాలని కోరారు. సాధ్యమైనంతవరకు కార్యాలయాలకు వచ్చేందుకు ప్రజా రవాణా వ్యవస్థను



వినియోగించుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

**పవన్ కళ్యాణ్ సైతం...**

ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా పొదుపు చర్యలు పాటిస్తూ ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని, అదే బాటలో రాష్ట్రంలోనూ ఈ విధానాన్ని కొనసాగించాలని పవన్ కళ్యాణ్ తన కార్యాలయం ద్వారా వెల్లడించారు. ఈ నిర్ణయం పట్ల సోషల్ మీడియా వేదికగా ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. గురువారం జరగనున్న క్యాబినెట్ భేటీలో ఈ పొదుపు చర్యలకు సంబంధించి మరిన్ని కీలక విధాన నిర్ణయాలు ప్రకటించే అవకాశం ఉంది.

**సీఎం రేవంత్ రెడ్డి కూడా..**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా తన కాన్వాయ్‌లో వాహనాల సంఖ్యను కుదించుకోవాలని భావిస్తున్నారు. ప్రస్తుతం ఆయన కాన్వాయ్‌లో సుమారు 9 వాహనాలు ఉండగా, వాటిని 4 నుంచి 5 వాహనాలకు పరిమితం చేసేలా కసరత్తు చేయాలని భద్రతా విభాగం పోలీసు అధికారులకు సూచించినట్లు సమాచారం. ఆయన తన నివాసం నుంచి ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీకి వెళ్లే క్రమంలో కేవలం మూడు వాహనాలతోనే ప్రయాణించడం ద్వారా తన సంకల్పాన్ని చాటుకున్నారు. ఈ అంశంపై రాబోయే రెండు రోజుల్లో స్పష్టత రానుంది, తద్వారా మంత్రుల కాన్వాయ్‌లలో కూడా వాహనాల సంఖ్య తగ్గే అవకాశం ఉంది.

# మానేరు డ్యామ్‌పై బ్రిడ్జి నిర్మాణానికై సంకల్ప దీక్ష

**గన్నేరువరం, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గన్నేరువరం నుండి మైసమ్మగుట్ట మీదుగా కరీంనగర్ సప్తగిరి కాలనీ స్మశాన వాటిక వరకు బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేస్తూ బ్రిడ్జి జేఏసీ ఆధ్వర్యంలో సంకల్ప దీక్ష చేపట్టారు.జేఏసీ చైర్మన్ సంపతి ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ, గన్నేరువరం--సప్తగిరి కాలనీ మధ్య మానేరు పైన బ్రిడ్జి నిర్మాణం జరిగితే మూడు మండలాల ప్రజలకు విస్తృత ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ఇప్పటికే గ్రామ పంచాయతీలు తీర్మానాలు చేసి మద్దతు ప్రకటించాయని, వేరే చోట బ్రిడ్జి నిర్మిస్తే ప్రజా పోరాటానికి సిద్ధమని హెచ్చరించారు.మానేరు డ్యామ్ నిర్మాణానికి భూములు కోల్పోయిన వారికి న్యాయం జరుగుతుందని, గన్నేరువరం ప్రజలకు కరీంనగర్




దూరం తగ్గుతుందని, హైదరాబాద్ ప్రయాణం సుమారు 30 కిలోమీటర్ల వరకు తగ్గుతుందని ఆయన వివరించారు. ఆలయ దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యం కలుగుతుందని, ప్రభుత్వం ఆధీనంలో భూములు ఉండటంతో అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి పెద్దగా భూమి సేకరణ అవసరం లేదని చెప్పారు.సంపతి ఉదయ్‌కుమార్ కేంద్రమంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఆర్‌డబి అధికారులు ప్రజల అభిప్రాయానికి విలువనిస్తూ గన్నేరువరం--సప్తగిరి కాలనీ మధ్య బ్రిడ్జి నిర్మించాలని కోరారు. తప్పుడు నివేదికలు ఇస్తూ ప్రజా ప్రతినిధులను తప్పుదోవ పట్టిస్తున్న ఆర్‌డబి ఈఈని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఉపయోగపడని బ్రిడ్జి నిర్మిస్తే నిరంతర పోరాటం చేస్తామని జేఏసీ హెచ్చరించింది.

# ఎండ తీవ్రతలో ఉపాధి హామీ కూలీలకు రక్షణ చర్యలు అవసరం

- బామండ్ల రవీందర్



**గన్నేరువరం, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గన్నేరువరం మండలంలోని చీమలకుంటపల్లి గ్రామంతో పాటు పలు గ్రామాలను సందర్శించిన బామండ్ల రవీందర్ మాట్లాడుతూ, మండలంలోనే కాకుండా జిల్లా, రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలను ఉదయం తొందరగా పనికి రప్పించి, ఎండ తీవ్రత దృష్టిలో పెట్టుకొని 9 గంటల లోపే ఇంటికి పంపించాలని సూచించారు. వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతున్నందున వడదెబ్బ తాకి కూలీలు ప్రాణనష్టం చెందే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. కూలీలు అనారోగ్యానికి గురైతే హాస్పిటల్ ఖర్చు మొత్తాన్ని ప్రభుత్వం భరించాలని, అదనంగా ఆర్థిక సహాయంగా లక్ష రూపాయలు అందజేయాలని డిమాండ్ చేశారు.వడదెబ్బ కారణంగా ఏ కూలి మరణించినా వారి కుటుంబానికి 20 లక్షల నష్టపరిహారం అందించాలని ఆయన స్పష్టం చేశారు. ఎండలు తగ్గేంత వరకు ఉపాధి హామీ పనులు ఉదయం 9 గంటల లోపే ముగించాలని తెలంగాణ రైతు కూలి సంఘం తరపున ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు, అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. కూలీల ఆరోగ్య రక్షణ కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని బామండ్ల రవీందర్ డిమాండ్ చేశారు.

# జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమం ప్రారంభించిన అశ్విని తానాజీ వాకాడే

**కొత్తపల్లి, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
99 రోజుల ప్రజా పాలనలో విద్యా వారోత్సవాల భాగంగా కొత్తపల్లిలోని పీఎంఎస ఎచ్‌ఆర్‌ఐ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ అశ్విని తానాజీ వాకాడే ప్రారంభించారు. 18వ వార్డు కార్పొరేటర్ వాసాల రమేష్ జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీ గ్రామంలోని వీక్లీ మార్కెట్ నుండి బస్ స్టాండ్ వరకు సాగింది. అక్కడ జరిగిన సమావేశంలో వాసాల రమేష్ మాట్లాడుతూ బడి వయసు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడమే బడిబాట ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న ఆధునిక వసతులు, నాణ్యమైన విద్యను తల్లిదండ్రులు వినియోగించుకోవాలని కోరారు.డీఈఓ డాక్టర్ అశ్విని తానాజీ వాకాడే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు విద్యార్థులకు అందుతున్నాయని వివరించారు. ఈ




విద్యా సంవత్సరంలో ఎక్కువ మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు తల్లిదండ్రులు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ మిల్కూరి శ్రీనివాస్, 17వ వార్డు కార్పొరేటర్ కవిత చంద్రశేఖర్, 18వ వార్డు కార్పొరేటర్ వాసాల రమేష్, కొత్తపల్లి ఎంఈఓ తుమ్మ ఆనందం, టీయూ జేఏసీ జిల్లా అధ్యక్షుడు బండ గోపాల్ రెడ్డి పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కన్నం రమేష్, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.కొత్తపల్లిలో బడిబాట కార్యక్రమం విద్యా వారోత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు మెంబర్గా రాపాక ప్రవీణ్ నియామకం



**మానకొండూర్, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ రాపాక ప్రవీణ్‌ను సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడిగా నియమిస్తూ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్ రీజినల్ ఆఫీసర్ డాక్టర్ రాహుల్ గౌలికర్ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా రాపాక ప్రవీణ్ తన నియామకానికి సహకరించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, పార్లమెంట్ సభ్యుడు బోయినపల్లి ప్రవీణ్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈనుగోండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రంగు భాస్కరాచారి, గుర్రాల వెంకటరెడ్డి, మండల అధ్యక్షుడు కంది రాజిరెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు.సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యత్వం రాపాక ప్రవీణ్‌కు విశిష్ట గుర్తింపుగా నిలిచింది.

# శాతవాహన అభివృద్ధికి కృషి

## శాతవాహన ఎడ్యుకేషనల్ ట్రస్ట్

**కరీంనగర్, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ రాష్ట్ర విద్యా వారోత్సవాల సందర్భంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శాతవాహన విశ్వవిద్యాలయ పరిపాలనా భవనంలో శాతవాహన ఎడ్యుకేషనల్ ట్రస్ట్ బోర్డు సమావేశం జరిగింది. ఉపకులపతి ఉమేష్ కుమార్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో ట్రస్ట్ విశ్వవిద్యాలయ సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడాలని, మౌలిక వసతులు కల్పించడంలో, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ట్రస్ట్‌కు సంబంధించిన రిజిస్టర్ కాపీని ఆయన



విడుదల చేశారు.రిజిస్ట్రార్ సతీష్ కుమార్ మాట్లాడుతూ విద్యా వారోత్సవాల సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాలను విశ్వవిద్యాలయ అభివృద్ధి దిశగా క్షుణ్ణంగా పరిశీలించామని, కొత్త విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు.వైస్ ప్రెసిడెంట్ బుర్ర మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ఉత్తర తెలంగాణలో ఏర్పాటు అయిన శాతవాహన విశ్వవిద్యాలయాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ట్రస్ట్ కీలక భూమిక వహిస్తుందని, విద్యా సంబంధిత సలహాలు, సాంకేతిక మౌలిక వసతుల ఏర్పాట్లను ట్రస్ట్ ద్వారా పూర్తి చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ సెక్రటరీ దీపిక, వీసీకి ఓఎస్డీ హరికాంత్, విద్యా వారోత్సవాల సమన్వయ అధికారి రమాకాంత్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు నిరంజనా చారి, ఎదుగంటి ప్రసాదరావు, వివిధ కళాశాల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు. శాతవాహన ఎడ్యుకేషనల్ ట్రస్ట్ బలోపేతం విశ్వవిద్యాలయ అభివృద్ధికి కొత్త దిశగా నిలుస్తుందని విద్యావర్గాలు అభిప్రాయపడ్డాయి.

# గ్రామంలో సర్పంచ్ బివిల్ల మోహన్ సమక్షంలో బడిబాట కార్యక్రమం

**బెజ్జంకి, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
బెజ్జంకి మండలం కళ్లెపెల్లి గ్రామంలో సర్పంచ్ బివిల్ల మోహన్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బుర్ర శశి వినీత్, పాలకవర్గ సభ్యులు, జెడ్పిహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయురాలు భారతి, పాఠశాల సిబ్బంది, ఎంసిపిహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు నజీర్, ర్యకం రాజు, ఒగ్గు కనకయ్య, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.కళ్లెపెల్లి గ్రామంలో బడిబాట కార్యక్రమం విద్యార్థుల చేరికకు ఉత్సాహాన్ని కలిగించింది.




# మేడిపల్లి ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన

**యాచారం , మే 14( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం "ప్రో!!జయశంకర్ బడిబాట" కార్యక్రమం యాచారం మండల పరిధిలోని జడ్పీహెచ్‌ఎస్ మేడిపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రధాన ఉపాధ్యాయురాలు ఉద్యశ్రీ , ఉపాధ్యాయులు తల్లితండ్రుల సర్పంచ్ ముచ్చర్ల సుగుణ సంపత్, ఉప సర్పంచ్ మధుకర్ రెడ్డి తో కలిసి ప్రభుత్వ పాఠశాల ప్రాధాన్యతను ప్రజలకు వివరిస్తూ అవగాహన ర్యాలీ సర్పంచ్ సుగుణ సంపత్ నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణం ఏర్పాటు చేసిన సమావేశంలో మేడిపల్లి నక్కర్త గ్రామంలో 2026 సంవత్సరం 10 తరగతిలో మండల టాపర్ మరియు
స్కూల్ టాపర్ గా నిలిచినా మరియు 500 కు పైన మార్కులు వచ్చిన వారికి గ్రామ సర్పంచ్ ముచ్చర్ల సుగుణ సంపత్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందించిన గురువులను కూడా సర్పంచ్ సన్మానం చేశారు








.సర్పంచ్ మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో చేరేవిధంగా పిల్లలను ప్రోత్సహిస్తూ 'బడి చూపుదాం – భవితను వెలిగిద్దాం ' ప్రభుత్వ పాఠశాలల – ప్రతిభావంతుల పుట్టినిల్లు అంటూ ప్రజలను చైతన్య పరుస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రటరీ తిరుపతయ్య, మాజీ ఎంపీటీసీ మోటే శ్రీశైలం, ఉపసర్పంచ్ దెంది మధుకర్ రెడ్డి, వార్డు సభ్యులు ఎర్కలి జ్యోతి, మక్కపల్లి మహేష్, కలకొండ బీరప్ప, ఉపాధ్యాయులు,
పీఆర్జీ ఫౌండేషన్ అధ్యక్షులు పొద్దుటూరి. రవీందర్ గుప్త, ఏవీజీ ఫౌండేషన్ అధ్యక్షులు గణేష్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు తప్పిన గోర ప్రమాదం

**కరీంనగర్, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు ప్రమాదం తప్పింది. కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో లిఫ్ట్ వైరు తెగిపోవడంతో ఈ ఘటన చోటుచేసుకుంది.జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల మార్కెట్ యార్డ్‌లో మక్కల కొనుగోలు కేంద్రం వద్ద లారీ అదుపుతప్పి పలువురు రైతులు గాయపడగా, వారు కరీంనగర్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిని పరామర్శించడానికి మంత్రి బుధవారం రాత్రి ఆసుపత్రికి చేరుకున్నారు.బాధితులను పరామర్శించడానికి మంత్రితో పాటు గన్‌మెన్లు, వ్యక్తిగత సిబ్బంది లిఫ్టులో మూడో అంతస్తుకు వెళుతుండగా ఒక్కసారిగా లిఫ్ట్ వైరు తెగిపోవడంతో లిఫ్ట్ కిందికి పడిపోయింది. అదృష్టవశాత్తూ పెద్ద ప్రమాదం తప్పింది.ఆసుపత్రుల నిర్వహణలో నిర్లక్ష్యం పట్ల మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.



# గ్రామ అభివృద్ధి, పారిశుధ్యం కై గ్రామసభలో తీర్మానాలు



**రామడుగు, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగిన గ్రామసభలో గ్రామ అభివృద్ధి, పారిశుధ్యం కోసం పలు తీర్మానాలు చేశారు. విందులు, శుభ అశుభ కార్యక్రమాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిస్తూ స్టీల్ ప్లేట్లు, గ్లాసులు వినియోగించాలని నిర్ణయించారు. ఇందుకోసం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో రెండు వేల స్టీల్ ప్లేట్లు, ఐదు వందల గ్లాసులు సమకూర్చాలని తీర్మానం చేశారు.ఇష్టారాజ్యాంగ చెరువులు, కుంటలు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త పారేస్తే ఆ చెత్తను తిరిగి వారి ఇంటి ముందు వేయాలని నిర్ణయించారు. పెద్ద చెరువు పూడిక మట్టిని తీయడం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టి వచ్చే ఆదాయాన్ని చెరువు అభివృద్ధికి, గ్రామ అవసరాలకు వినియోగించాలని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని కుల సంఘాలు, యువత, మహిళా సంఘాలను భాగస్వాములను చేయాలని నిర్ణయించారు. గ్రామాభివృద్ధి కోసం ప్రజలు సహకరించాలని గ్రామసభలో కోరారు.రామడుగులో గ్రామసభ తీర్మానాలు గ్రామ అభివృద్ధికి కొత్త దిశగా నిలిచాయి.

## రైల్వే లైన్ కింద ఇల్లు కోల్పోతున్న వారికి స్థలాల కేటాయింపునకు భూమి పరిశీలన



**గంగాధర, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని కొత్తపల్లి నుండి మనోహరాబాద్ రైల్వే లైన్ కింద ఇల్లు కోల్పోతున్న రంగారావుపల్లి, కాసారం గ్రామాల రైతుల కుటుంబాలకు ఇండ్ల స్థలాల కేటాయింపునకు భూమి పరిశీలన చేపట్టారు.కురిక్యాల గ్రామంలోని సర్వే నంబర్ 518లో భూమి పరిశీలనకు కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్, తహసీల్దార్ రజిత, మండల సర్వేయర్ కుమార్, ఆర్ఐ సంతోష్ కుమార్, ఆర్డీవో కార్యాలయం ఎస్ఏ షరీఫ్, జేఏ వినోద్ హాజరయ్యారు.రైల్వే లైన్ కారణంగా ఇల్లు కోల్పోయిన భూస్వాములకు ప్రభుత్వం భూమి కేటాయింపునకు చర్యలు ప్రారంభించింది.

## దేశ అభివృద్ధికి జనగణన అత్యంత కీలకం




**కరీంనగర్, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
భారతదేశమంతటా 2027 ఫిబ్రవరిలో జరగనున్న జనాభా గణనలో తొలి విడతగా గృహాల జాబితా, గృహాల గణన ఆదర్శ్ నగర్‌లో ప్రారంభమైంది. ఈ నెల 11, 12, 13 తేదీల్లో ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన ప్రాంతాల్లోని కట్టడాలను లెక్కించి మ్యాప్ తయారు చేశారు. 26వ వార్డు సూపర్వైజర్ ఆంజనేయులు మాట్లాడుతూ మే 11 నుండి జూన్ 9 వరకు కొనసాగే ఈ గృహ గణనలో ప్రజలందరూ సహకరించాలని కోరారు. ప్రభుత్వం రూపొందించే పథకాల రూపకల్పనకు, దేశ అభివృద్ధికి ఈ జనాభా గణన అత్యంత కీలకమని, సరైన వివరాలను అందించడం ద్వారా ప్రజలు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్యుమరేటర్లు నలుమాచు చంద్రశేఖర్, మధుకర్, ఇందిర సాలమన్ రాజు, జలజ పాల్గొన్నారు.జనగణనలో ప్రజల సహకారం దేశ అభివృద్ధికి పునాది అవుతుందని అధికారులు పేర్కొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన మాజీ మంత్రి గంగుల కమలాకర్



**కరీంనగర్, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం చింతకుంట గ్రామంలో డిసిఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజీ మంత్రి గంగుల కమలాకర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులను ఇబ్బంది పెట్టకుండా వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. తనిఖీ సమయంలో రైతులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.రైతుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కమలాకర్ సూచించారు.

# ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అలుమ్నీ, పేరెంట్-టీచర్స్ సమావేశం

**కరీంనగర్, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. సప్తగిరి కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ చాడగొండ కవితా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విశాలమైన తరగతి గదులు, ఆధునిక బోధన పద్ధతులు, ఆటస్థలం, జిమ్, హరితవనం వంటి వసతులు కల్పించబడ్డాయని, ఫలితాల్లోనూ గొప్ప ప్రగతి సాధిస్తున్నాయని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. అర్బన్ మండల విద్యాధికారి భద్రయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ విద్య అందుతోందని, విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం, యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, ప్రత్యేక కిట్ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారని తెలిపారు. డిజిటల్ విద్య, స్టెమ్ వంటి సాంకేతిక అంశాలను బోధిస్తూ రాబోయే తరాలకు అనుగుణమైన విద్యను





అందించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని పేర్కొన్నారు.ఇక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అలుమ్నీ సమ్మేళనం, మెగా పేరెంట్-టీచర్స్ సమావేశం సందడిగా జరిగింది. ప్రిన్సిపల్ వరలక్ష్మి మాట్లాడుతూ కళాశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకుల భాగస్వామ్యం కీలకమని తెలిపారు. అలుమ్నీ సభ్యులు తమ అనుభవాలను పంచుకుంటూ విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. గ్రామీణ నేపథ్యం నుండి వచ్చిన విద్యార్థినులు కూడా కృషి, ఆత్మవిశ్వాసంతో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని వారు ప్రేరణనిచ్చారు.తదుపరి సిపిడిసి సమావేశంలో కళాశాల విద్యా పురోగతి, మౌలిక వసతుల అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను సభ్యులు అభినందించారు. అనంతరం నిర్వహించిన పేరెంట్-టీచర్స్ సమావేశంలో తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొని విద్యార్థుల హాజరు, క్రమశిక్షణ, చదువుపై ఆసక్తి, మానసిక వికాసంపై అధ్యాపకులతో చర్చించారు.ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో జరుగుతున్న ఈ కార్యక్రమాలు విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్నాయి.

## రైతు వేదికలో వ్యవసాయా అంశాలపై శిక్షణ సదస్సు



**పూడూర్, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం సంస్థ ఆధ్వర్యంలో పూడూర్ రైతు వేదికలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులకు వ్యవసాయానికి సంబంధించిన అంశాలపై నిపుణులు సూచనలు అందించారు.ఇఫ్కో ప్రతినిధులు నానో యూరియా, డీఏపీ, జింక్, కాపర్ వంటి ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. జాతీయ నూనెగింజల పరిశోధన సంస్థ రాజేంద్రనగర్‌కు చెందిన శాస్త్రవేత్తలు ఉషా కిరణ్, రమ్య భూసార పరీక్షల ప్రాముఖ్యతను వివరించి, పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం ఎలా ఉండాలో సూచించారు. ఉద్యాన శాఖ అధికారి సంతోష్ కుమార్ ఆయిల్ పామ్ సాగు గురించి వివరించారు. కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, పూడూర్ పిఏసిఎస్ చైర్మన్ సతీష్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్, విస్తరణ అధికారులు, గ్రామాల సర్పంచులు, పిఏసిఎస్ డైరెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.ఆధునిక ఎరువుల వినియోగం, భూసార పరీక్షల ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన కల్పించడం ఈ శిక్షణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## బండి భగీరత్ ను వెంటనే అరెస్టు చేయాలి

- ఆమనగల్లులో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ
- మహిళలకు భద్రత కల్పించలేని ప్రభుత్వం గద్దె దిగాలి
- బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్




**ఆమనగల్లు, మే 14 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మైనర్ బాలికను లైంగికంగా వేధింపులకు గురిచేసిన కేసులో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరత్ ను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కోరుతూ బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పిలుపుమేరకు ఆమనగల్ పట్టణంలో తెలంగాణ రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ గుప్తా, ఆమనగల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆమనగల్ మున్సిపాలిటీ బిఆర్ఎస్ కౌన్సిలర్ లు ప్రజలు వేలాదిమంది మహిళలతో కలిసి పెద్ద ఎత్తున హైదరాబాద్ శ్రీశైలం జాతీయ రహదారి గుండా నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మైనర్ బాలికను వేధించిన బండి భగీరత్ ను వెంటనే ఉరితీయాలని డిమాండ్ చేశారు. సామాన్యులకు ఓ న్యాయం రాజకీయ అండతో పలుకుబడి కలిగిన ప్రజా ప్రతినిధులకు ఓ న్యాయమా అంటూ నినాదాలు చేశారు. బండి సంజయ్ డౌన్ డౌన్, ఆడపిల్లలకు భద్రత కల్పించని ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని డిమాండ్ చేశారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వెంటనే క్షమాపణ చెప్పి కేంద్ర మంత్రి పదవికి బండి సంజయ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కౌన్సిలర్లు పాపిశెట్టి రాము, ఎనుముల రమేష్, ఎంగలి భాగ్యలక్ష్మి, నాగిళ్ల జగన్, పుల్లారెడ్డి అనూష, వీరయ్య, నాయకులు సయ్యద్ ఖలీల్, సైదులు గౌడ్, అమృతం పాండు, సతీష్, శ్రీను, జంతుక కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రియురాలిపై అనుమానం గొడ్డలితో హత్య



**పాలకుర్తి, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పాలకుర్తి మండలం పుట్నూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో మంగళవారం రాత్రి బౌతు సుమలతను హత్య చేసిన ప్రియుడు వేల్పుల స్వామిని పోలీసులు గురువారం అరెస్టు చేశారు.స్వామి హార్వెస్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ కొంతకాలంగా సుమలతతో ప్రేమ సంబంధం కొనసాగించాడు. అయితే మద్యం అలవాటు మానితేనే పెళ్లి చేసుకుంటానని సుమలత స్పష్టంగా చెప్పడంతో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. సుమలత తనను దూరం పెట్టి మరొకరిని పెళ్లి చేసుకుంటుందేమోనని అనుమానం పెంచుకున్న స్వామి మద్యం మత్తులో ఆవేశానికి గురై మంచంలో నిద్రిస్తున్న సుమలతను గొడ్డలితో దాడి చేసి హత్య చేశాడు.హత్య అనంతరం స్వామి సంఘటన స్థలం నుండి పరారై గొడ్డలిని గ్రామ శివారులోని వాగులో పడవేశాడు. పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ నూతి శ్రీధర్ ఆధ్వర్యంలో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి గురువారం ఈసాల తక్కళ్లపల్లి గ్రామ సమ్మక్క సారలమ్మ దేవస్థానం వద్ద స్వామిని అదుపులోకి తీసుకున్నారు.ఏసీపీ గజ్జి కృష్ణ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తూ నిందితుడిపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. నిందితున్ని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ నూతి శ్రీధర్, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, శేఖర్‌లను అభినందించారు.ప్రియురాలిపై అనుమానం, మద్యం మత్తు -- ఈ రెండు కారణాల వల్లే సుమలత ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు తెలిపారు.

## వ్యవసాయ అవసరాలకై చెరువు మట్టిని వినియోగించాలి

-జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని చెరువులలోని సారవంతమైన మట్టిని రైతులు తమ వ్యవసాయ భూములకు తరలించుకోవడానికి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అనుమతులు మంజూరు చేయనున్నట్లు ప్రకటించారు.రేపటి నుండి రైతులు సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులో రైతు వివరాలు, భూమి విస్తీర్ణం, పీపీబీ వివరాలు, రవాణా వాహనం వివరాలు, వాహన నంబర్ తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. తహసీల్దార్ పరిశీలన అనంతరం అనుమతులు జారీ చేసి రైతులు చెరువుల నుంచి మట్టిని తరలించుకోవచ్చని వివరించారు. రైతులకు ఈ సారవంతమైన చెరువు మట్టిని పూర్తిగా ఉచితంగా అందజేస్తున్నామని, వ్యవసాయ అవసరాలకే వినియోగించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇతర అవసరాలకు మట్టిని మళ్లిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారి వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు భారీ జరిమానాలు విధించి కేసులు నమోదు చేస్తామని తెలిపారు.రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ భూముల ఉత్పాదకతను పెంచుకోవాలని కలెక్టర్ సూచించారు.

## జెండా-మజీద్ రోడ్ విస్తరణపై అయోమయం తొలగి పనులు ప్రారంభం



(నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఎఫెక్ట్


జెండా- మజీద్ రోడ్ విస్తరణపై అయోమయం

పెద్దపల్లి, మే 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారి జెండా నుండి మజీద్ వరకు రోడ్ విస్తరణపై ప్రజల్లో అయోమయం నెలకొంది. కలెక్టర్, ఎమ్మెల్యేలు రోడ్డును 80 పీట్లు వెడల్పు చేయాలని నిర్ణయించినప్పటికీ, మున్సిపల్ అధికారులు 66 పీట్లకు పరిమితం చేశారు. వ్యాపారవేత్తలు, కామర్స్ అసోసియేషన్ యజమానులు మాత్రం 50 పీట్లకే పరిమితం చేయాలని పట్టుబడుతున్నారు. మున్సిపల్ కమిషనర్, చైర్మన్ వ్యాపారవేత్తలకు సమయం ఇచ్చినా, ఇంజనీరింగ్ అధికారులు ఇరువైపులా 66 పీట్లు కొలతలు వేసి మార్కింగ్ చేసినప్పటికీ, ఇప్పటివరకు పనులు ప్రారంభం కాకపోవడం ప్రజల్లో అసంతృప్తి కలిగిస్తోంది. ప్రజలు, మహిళలు, వాహనదారులు, విద్యార్థులు, రాజకీయ నాయకులు రోడ్డు విస్తరణను వెంటనే చేపట్టి ట్రాఫిక్ సమస్యలు, పాదచారుల ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు. ముఖ్యంగా ఉత్సవాలు, పండగలు, ర్యాలీలు జరిగే సమయంలో రహదారి ఇరుకుగా ఉండడం వల్ల తీవ్ర సమస్యలు వస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు, వ్యాపారవేత్తలు, స్థానిక నాయకులు కలసి జిల్లా కేంద్రంలోని జెండా--మజీద్ రోడ్ విస్తరణను త్వరితగతిన పూర్తి చేసి డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులను వేడుకుంటున్నారు.

**పెద్దపల్లి, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారి జెండా నుంచి మజీద్ వరకు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ రహదారి విస్తరణపై కొంతకాలంగా ప్రజల్లో అయోమయం నెలకొంది. కలెక్టర్, ఎమ్మెల్యేలు 80 ఫీట్ల విస్తరణకు ఆమోదం తెలిపినప్పటికీ మున్సిపల్ అధికారులు 66 ఫీట్లకే పరిమితం చేశారు. మరోవైపు వ్యాపారవేత్తలు, కామర్స్ అసోసియేషన్ యజమానులు 50 ఫీట్లకే పరిమితం చేయాలని పట్టుబట్టారు. ఇంజనీరింగ్ అధికారులు ఇరువైపులా 66 ఫీట్ల కొలతలు నిర్వహించి మార్కింగ్ చేసినప్పటికీ పనులు ఆలస్యమవడంతో ప్రజల్లో అసంతృప్తి పెరిగింది. చివరకు నీలగిరి ఎక్స్‌ప్రెస్‌లో వచ్చిన వార్తకు స్పందించిన అధికారులు విస్తరణ పనులు ప్రారంభించారు. ప్రజలు, వ్యాపారవేత్తలు, వాహనదారులు, విద్యార్థులు, మహిళలు, రాజకీయ నాయకులు రహదారి విస్తరణను వేగంగా పూర్తి చేసి డివైడర్లు, సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఉత్సవాలు, పండగలు, ర్యాలీల సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా విస్తరణ అత్యవసరమని స్థానికులు అభిప్రాయపడ్డారు. జెండా--మజీద్ రోడ్ విస్తరణ పనులు ప్రారంభం కావడంతో ప్రజల్లో ఊరటనిచ్చింది.

# ఎంపీ వంశీక్రిష్ణపై బిజెవైఎం నేతల విమర్శలు

**పెద్దపల్లి, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కేంద్ర ప్రభుత్వంపై పెద్దపల్లి ఎంపీ వంశీక్రిష్ణ ఉద్దేశపూర్వకంగా అసత్య ఆరోపణలు చేస్తున్నారని భారతీయ జనతా యువమోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉప్పు కిరణ్ మండిపడ్డారు. గురువారం పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణపై కేంద్రం వివక్ష చూపుతోందని, బిహార్, ఉత్తరప్రదేశ్‌కే నిధులు కేటాయిస్తోందని వంశీక్రిష్ణ ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల అభివృద్ధికి ప్రధాని నరేంద్రమోదీ నిజాయతీగా నిధులు కేటాయిస్తున్నారని, రోడ్ల అభివృద్ధి, ఆర్వోబిల నిర్మాణం, పరిశ్రమల ఏర్పాటుకు తగిన ప్రోత్సాహకాలు అందిస్తున్నారని వివరించారు.




ఖాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ శంఖుస్థాపన, రామగుండం ఆర్ఎఫ్సిఎల్ పునఃప్రారంభం సందర్భంగా రూ.5,250 కోట్లు కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. మీ ప్రభుత్వంలో మీకే తగిన ప్రోటోకాల్ లేకపోవడం ప్రజలకు తెలుసునని, జిల్లా కలెక్టరును టార్గెట్ చేయడం నిజం కాదా అని ప్రశ్నించారు. మంచిర్యాల జిల్లాకు ఎంపీనా లేక పెద్దపల్లికేనా అన్న సందేహం మీ కార్యకర్తలే సోషల్ మీడియాలో వ్యక్తం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అసత్యాలు, అబద్దాలు ప్రచారం చేస్తే ఇకపై ప్రజల నుండి ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు వెంకన్న, పట్టణ ఉపాధ్యక్షులు పోగుల రాజు, కార్యదర్శి కుశనపల్లి మధుకరణ్ బాగావత్, పట్టణ అధ్యక్షులు కుక్క అంజి, ఎస్సిమోర్చా పట్టణ అధ్యక్షులు సిందే శివసాయి, హర్ష, మహేష్, హరీష్, గదాసి సతీష్ తదితరులు పాల్గొన్నారు. కేంద్రంపై అబద్దాలు ప్రచారం చేస్తే ఇక ఊరుకోబోమని బిజెవైఎం నేతలు స్పష్టం చేశారు.

## నీట్ పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జి విచారణ జరపాలని సిపిఐ డిమాండ్



**కరీంనగర్, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నీట్ పరీక్షలో పేపర్ లీకేజీలపై పూర్తి స్థాయి సమగ్ర విచారణ జరపాలని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ పిడిఎస్యూ జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ పరీక్షలో పేపర్ లీకేజీ ఆరోపణలు వెలుగులోకి రావడం అత్యంత ఆందోళనకరమని పేర్కొన్నారు. గతంలో కూడా ఇలాంటి ఘటనలు జరిగినందున కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని అన్నారు. లక్షలాది మంది విద్యార్థులు ఎంతో కష్టపడి భవిష్యత్తుపై ఆశలతో పరీక్ష రాస్తుండగా, కొందరి అక్రమ చర్యల వలన వారి భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నాపత్రం ముందుగానే లీక్ అయిందనే వార్తలు విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఆగ్రహాన్ని రేపాయని తెలిపారు. ఈ ఘటనపై కేంద్ర ప్రభుత్వం, దర్యాప్తు సంస్థలు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థపై ప్రజల విశ్వాసం నిలబెట్టేందుకు సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జి ఆధ్వర్యంలో న్యాయ విచారణ జరగాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పిడిఎస్యూ నాయకులు దినేష్, మురళి, రాజ్‌కుమార్, భరత్, శ్రీకాంత్ పాల్గొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే వారిని ఉపేక్షించరాదని పిడిఎస్యూ నేతలు హెచ్చరించారు.

## బాలసదనం, శిశుగృహాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్ అశ్విని తనాజీ వాకడే



**కరీంనగర్, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) అశ్విని తనాజీ వాకడే గురువారం బాలసదనం, శిశుగృహాన్ని సందర్శించారు. చిన్నారుల వివరాలు, ఆరోగ్య పరిస్థితులు, దత్తత ప్రక్రియపై సమాచారం సేకరించారు. వేసవి కాలంలో ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని చిన్నారుల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తనిఖీ సందర్భంగా బాలసదనం చిన్నారులను సమ్మర్ క్యాంపుకు పంపినట్లు సూపరింటెండెంట్ వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ పర్వీన్, పి.ఓ-ఐ.సి శాంత, బాలసదనం సూపరింటెండెంట్ సంతోషిని, శిశుగృహ మేనేజర్ అపూర్వ, కౌన్సిలర్ కీర్తి, సిబ్బంది పాల్గొన్నారు. చిన్నారుల సంక్షేమం కోసం తీసుకోవాల్సిన చర్యలను అదనపు కలెక్టర్ ప్రత్యేకంగా సూచించారు.

## ఎస్సెస్సీ ఫలితాల్లో టాపర్‌కు ఘన సన్మానం




**పెద్దపల్లి, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఇటీవల విడుదలైన ఎస్సెస్సీ ఫలితాల్లో ఓదెల మండలంలో టాపర్‌గా నిలిచిన రసాల మేఘనను జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారి వేణుగోపాల్ రావు పెద్దపల్లి కలెక్టర్ కార్యాలయంలో శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ స్వర్ణలత, క్యాడర్ ఎన్‌జీఓ జనరల్ సెక్రటరీ గజ్జెల్లి సతీష్, రవి, జయదేవ్, గణేష్ పాల్గొన్నారు. రసాల మేఘన ప్రతిభను గుర్తించి చేసిన ఈ సన్మానం విద్యార్థులకు ప్రేరణగా నిలిచింది.

## విజయవంతంగా బడి బాట కార్యక్రమం




**గంగాధర, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలోని ఒద్యారం గ్రామంలో ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ఎంపీడీవో రాము ఆధ్వర్యంలో బడి బాట కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి, ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతను వివరించారు. అనంతరం గ్రామ సభలో "మన ఊరి పిల్లలు మన ప్రభుత్వ పాఠశాలల్లోనే చదవాలి" అనే సంకల్పంతో చర్చలు జరిగాయి. వార్డ్ సభ్యులు బాధ్యత తీసుకొని ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు కృషి చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ ఏనుగు ప్రభాకర్ రావు ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, సౌకర్యాలు, విద్యార్థుల భవిష్యత్తు అవకాశాల గురించి తల్లిదండ్రులకు వివరించారు. ప్రభుత్వ పాఠశాల -- ప్రతి పిల్లవాడి హక్కు, ప్రతి గ్రామం గర్వం అనే సందేశంతో గ్రామంలో విద్యాపట్ల కొత్త చైతన్యం నెలకొంది.

## ప్రైవేట్ టీచర్లపై అడ్మిషన్ టార్గెట్ల వేధింపులు ఆపాలని ఏఐవైఎఫ్ డీమాండ్



**హుస్నాబాద్, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులపై అడ్మిషన్ టార్గెట్ల పేరుతో వేధింపులు పెరుగుతున్నాయని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జనగాం రాజకుమార్ విమర్శించారు. అడ్మిషన్లు తీసుకురాకపోతే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని, జీతాలు తగ్గిస్తామని యాజమాన్యాలు బెదిరిస్తున్నాయని ఆయన తెలిపారు. ఉపాధ్యాయుల ప్రధాన బాధ్యత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం మాత్రమేనని, మార్కెటింగ్ పనులు చేయించడం కాదని స్పష్టం చేశారు. టీచర్లను అడ్మిషన్ల కోసం ఒత్తిడి చేయడం వల్ల వారి ఆత్మస్థైర్యం, వృత్తి గౌరవం దెబ్బతింటోందని పేర్కొన్నారు. ప్రైవేట్ స్కూల్లు లాభాపేక్షను తగ్గించి విద్యా ప్రమాణాల పెంపుపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి ప్రైవేట్ టీచర్ల హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. అలాగే ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రైవేట్ టీచర్లపై అడ్మిషన్ టార్గెట్ల ఒత్తిడి నిలిపివేయాలని ఏఐవైఎఫ్ స్పష్టం చేసింది.

## ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీపై విచారణ జరపాలని మేడిపల్లి సత్యం డిమాండ్



**కరీంనగర్, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ పట్టణంలో విచ్చలవిడిగా పెరుగుతున్న ప్రైవేట్ ఆసుపత్రులపై సమగ్ర విచారణ జరపాలని కోరుతూ చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. ఆసుపత్రులలో మౌలిక సదుపాయాలు అత్యంత దయనీయంగా ఉన్నాయని, అర్హత లేని డాక్టర్లు, తక్కువ జీతాలకు సిబ్బందిని పెట్టి శస్త్రచికిత్సలు చేయిస్తూ రోగుల ప్రాణాలతో ఆటలాడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. లిఫ్టులు, వీల్‌చైర్లు, బెడ్లు వంటి అత్యవసర సౌకర్యాలు లేకపోవడం, పారిశుద్ధ్యం లోపించడం వల్ల రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చిన్న జ్వరం వచ్చినా అనవసర పరీక్షలు రాసి లక్షల్లో బిల్లులు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తూ, ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, వెంటనే అన్ని ప్రైవేట్ ఆసుపత్రులపై సమగ్ర విచారణ జరిపి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను లేఖలో కోరారు. రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంలో పేదలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యం అని, కార్పొరేట్ ఆసుపత్రుల దోపిడీని సహించేది లేదని, ప్రజల ప్రాణాలతో ఆటలాడే ఆసుపత్రులపై ఉక్కుపాదం మోపాల్సిందేనని మేడిపల్లి సత్యం స్పష్టం చేశారు. ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీపై సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ మరింత బలంగా వినిపిస్తోంది.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని రైతులు డిమాండ్



**హుస్నాబాద్, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పందిళ్ల ఐకెపి సెంటర్ వద్ద రైతులు ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న ఆలస్యంపై రాస్తారోకో నిర్వహించారు.
సిద్దిపేట--హనుమకొండ ప్రధాన రహదారిపై వాహనాలు భారీగా నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఐకెపి కేంద్రంలో నెలరోజుల క్రితమే ధాన్యం పోసినా ఇప్పటికీ కొనుగోలు చేయకపోవడం, కనీస సౌకర్యాలు లేకపోవడం, ప్యాడి క్లీనింగ్ మిషన్లకు విద్యుత్ సౌకర్యం లేకపోవడం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యంతో తక్కువ ధరకే ధాన్యం కొనుగోలు చేస్తున్నారని మండిపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని రైతులతో చర్చించారు. సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని రైతులు డిమాండ్ చేశారు.

## పూర్వ విద్యార్థులకు ఆర్టీఎఫ్ చెక్కుల పంపిణీ -

**- ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులకు అవగాహన**




**ఆమనగల్, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆమనగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థులకు ఆర్టీఎఫ్ చెక్కులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీపాద శర్వాణి స్వయంగా చెక్కులను పంపిణీ చేశారు. తరువాత ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు కళాశాలలో ప్రవేశాలు పొందాల్సిందిగా అవగాహన కల్పిస్తూ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. "ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య, సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి" అని ప్రిన్సిపాల్ శర్వాణి సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పీఎంజే జ్యువెలరీ దోపిడీ కేసులో అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్

**కరీంనగర్, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ 2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పీఎంజే జ్యువెలరీ షాపులో మే 3న జరిగిన దోపిడీ కేసులో అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనలో రూ.82 లక్షల విలువైన బంగారు, వజ్రాభరణాలు దోచుకెళ్లగా నలుగురు సిబ్బంది గాయపడ్డారు. బీహార్ జైలులో ఉన్న గ్యాంగ్ హ్యాండ్లర్ సుభోద్ సింగ్ ప్రణాళిక ప్రకారం ఈ దోపిడీ జరిగింది. ప్రధాన నిందితుడు రఘునాథ్ కర్మాకర్‌ను వెలిచాల ఎక్స్ రోడ్ వద్ద అరెస్ట్ చేయగా, రవీష్ కుమార్ ప్రద్యుమన్, మెహతాబ్ ఖాన్‌లను బీహార్, పశ్చిమ బెంగాల్‌లో అదుపులోకి తీసుకుని ట్రాన్సిట్ వారెంట్‌పై కరీంనగర్‌కు తీసుకువచ్చారు. విచారణలో ఈ ముఠా బీహార్, బెంగాల్, జార్ఖండ్, తెలంగాణ, మహారాష్ట్ర రాష్ట్రాల్లో జ్యువెలరీ షాపులు, బ్యాంకులను లక్ష్యంగా చేసుకుని దోపిడీలు నిర్వహిస్తున్నట్లు బయటపడింది. నిందితులు ముందుగా రేక్కీ నిర్వహించి, నకిలీ ఆధార్ కార్డులు, బైక్ నంబర్ ప్లేట్లు ఉపయోగించి, ఆయుధాలతో దోపిడీలు జరిపినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో




ఇప్పటివరకు 13 మంది నిందితులను గుర్తించగా, ముగ్గురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.51,000 నగదు, మొబైల్ ఫోన్లు, నకిలీ ఆధార్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు.పోలీసులు బ్యాంకులు, జ్యువెలరీ షాపులు, లాడ్జ్ యజమానులు నాణ్యమైన సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. మిగిలిన నిందితులను త్వరలోనే అరెస్ట్ చేస్తామని కరీంనగర్ పోలీసులు తెలిపారు.అంతర్రాష్ట్ర ముఠా అరెస్టుతో పీఎంజే దోపిడీ కేసులో కీలక పురోగతి సాధించినట్లు పోలీసులు వెల్లడించారు.

## బండి సంజయ్‌పై తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదని బీజేపీ నాయకుల హెచ్చరిక



**జమ్మికుంట, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని జమ్మికుంట పట్టణంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌పై తప్పుడు ప్రచారం చేస్తూ పోస్టర్లు అంటించడాన్ని బీజేపీ నాయకులు తీవ్రంగా తప్పుపట్టారు.బండి భగీరథ, బండి సంజయ్ ఫోటోలు కలిపి పెట్టిన పోస్టర్లను నిరసనగా చించి వేసినట్లు తెలిపారు. పట్టణ శాఖ ఆధ్వర్యంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్ నేతృత్వంలో నాయకులు పట్టణంలో తిరుగుతూ పోస్టర్లను తొలగించారు.ఈ కార్యక్రమంలో ఆకుల రాజేందర్, దొంతర వీణ రమేష్ యాదవ్, సంపెల్లి సంపత్ రావు, కైలాసకోటి గణేష్, ఆవుల తిరుపతి, శ్రీపతి అఖిల్, అడవుల శ్రీధర్, రాయబారం సురేష్, పంజాల అనిల్, ఉడుగుల మహేందర్, సుంకర్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ సెల్ అధ్యక్ష పదవికి దరఖాస్తుల స్వీకరణ




**కరీంనగర్, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుందని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎస్సీ సెల్ పరిశీలకుడు కొరివి అరుణ్ కుమార్ తెలిపారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ విభాగం చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు వినూత్న పద్ధతిలో జిల్లా, నగర ఎస్సీ సెల్ అధ్యక్షుల ఎంపిక జరుగుతోందని చెప్పారు.జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం, అర్బన్ డిసిసి అధ్యక్షుడు అంజన్ కుమార్ అనుమతితో ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లా అధ్యక్ష పదవికి 20, నగర అధ్యక్ష పదవికి 5, మండల అధ్యక్ష పదవికి 10 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ దరఖాస్తులను క్రోడీకరించి నివేదిక రూపంలో రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణకు అందజేస్తామని, పైరవీలకు తావు లేకుండా కష్టపడి పనిచేసిన కార్యకర్తలతోనే కమిటీల ఎంపిక జరుగుతుందని స్పష్టం చేశారు.ఈరోజు దరఖాస్తు చేసుకోలేని ఆశావహులకు రేపటి వరకు అవకాశం ఉందని, శుక్రవారం సాయంత్రం ఐదు గంటలలోగా జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.దళిత కాంగ్రెస్ నాయకులు, ఆశావహులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ సమావేశం పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపింది.

## నీట్ పేపర్ లీక్‌పై ఎన్ఎస్‌యూఐ నిరసన




**అమ్రాబాద్, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నీట్ పరీక్షలో పేపర్ లీక్ ఘటనపై కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని, ఎన్‌టిఏ సంస్థను రద్దు చేయాలని ఎన్ఎస్‌యూఐ నాయకులు డిమాండ్ చేశారు.అమ్రాబాద్ మండల కేంద్రంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు, డిసిసి అధ్యక్షుడు అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పిలుపుతో విద్యార్థులు ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు రామావత్ సంతోష్, వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లవెల్లి యశ్వంత్, తాలూకా అధ్యక్షుడు లడ్డు యాదవ్, జిల్లా జనరల్ సెక్రటరీ దాసరి కార్తీక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రహీం, మున్ననూర్ సర్పంచ్ మంజుల రాజరాం తదితరులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ, 2015లో ఏఐపీఎమ్‌టీ, 2024లో నీట్, ఇప్పుడు 2026లో మళ్లీ పేపర్ లీక్ కావడం దేశ విద్యా వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. 22 లక్షలకుపైగా విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో ఉన్నా కేంద్ర ప్రభుత్వం మౌనంగా ఉందని విమర్శించారు. విద్యార్థుల న్యాయం కోసం ఎన్ఎస్‌యూఐ దేశవ్యాప్తంగా పోరాటం ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఎన్‌టిఏ రద్దు, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సీబీఐ దర్యాప్తు, ప్రభావిత విద్యార్థులకు ఉచిత మానసిక ఆరోగ్య సహాయం, న్యాయ సహాయం, ఆర్థిక నష్టపరిహారం అందించాలని వారు డిమాండ్ చేశారు.విద్యార్థుల భవిష్యత్తు కోసం చివరి వరకు పోరాడుతామని ఎన్ఎస్‌యూఐ నేతలు స్పష్టం చేశారు.

## బండి భగీరథ్‌పై సిపిఎం ఆగ్రహం




**అమ్రాబాద్, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మైనర్ బాలికపై కేసు నమోదైనప్పటికీ బండి భగీరథ్‌ను అరెస్టు చేయకుండా నిర్లక్ష్యం చేయడం తగదని, వెంటనే అరెస్టు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి వర్ధం సైదులు డిమాండ్ చేశారు.అచ్చంపేట మండల కేంద్రంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వర్ధం సైదులు మాట్లాడుతూ, సాధారణ ప్రజలపై కేసులు నమోదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటారు, కానీ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కుమారుడి విషయంలో మాత్రం ఆలస్యం చేయడం అన్యాయం అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అండదండలతో కుమారుడు చేసిన తప్పును కప్పిపుచ్చే ప్రయత్నం సరైనది కాదని, వెంటనే అరెస్టు చేసి బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి. రాములు, శివకుమార్, వెంకటయ్య, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు నిర్మల, అడ్డకూలి సంఘం కార్యదర్శి వెంకటయ్య, రాజు, మల్లేష్, గోపాల్, రాములు తదితరులు పాల్గొన్నారు.చట్టం ఎవరికి చుట్టం కాదని, న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని సిపిఎం నేతలు స్పష్టం చేశారు.

## మన ఊరు-మన బడి కార్యక్రమం ప్రారంభం




**మర్రిగూడ, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మర్రిగూడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో గురువారం ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా 'మన ఊరు--మన బడి, ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం' ప్రారంభమైంది.మే 14 నుంచి జూన్ 19 వరకు కొనసాగనున్న ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల చేరికలను పెంచే లక్ష్యంతో ఉపాధ్యాయులు ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి, తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలో లభించే మౌలిక వసతులు, సౌకర్యాలు, విద్యా ప్రమాణాలు వివరించి, పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించేందుకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా పరిషత్ పాఠశాల నుంచి బస్టాండ్ వరకు విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మర్రిగూడ సర్పంచ్ వీరమల్ల శిరీష లోకేష్ గౌడ్, జిహెచ్‌ఎం రూప్ సింగ్, ఉపాధ్యాయులు మాస బాలరాజు, కృష్ణ, శోభ, నాగేంద్రమ్మ, శీను, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాలు రుణాలు సద్వినియోగం చేసుకోవాలి


- ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి



**నాగర్‌కర్నూల్, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గ్రామీణ ప్రాంతాల్లో మహిళా చిరు వ్యాపారులను ఆర్థికంగా ఆదుకోవడమే లక్ష్యంగా గ్రామీణ కూట బ్యాంకు ఆధ్వర్యంలో రుణాలను మంజూరు చేస్తున్నామని డివిజన్ మేనేజర్ వారణాసి చంద్రశేఖర్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలో బ్యాంకు కార్యాలయాన్ని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా మేనేజర్ బ్యాంకు అందిస్తున్న సేవలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ఆర్బీఐ నిబంధనల ప్రకారం అందించే రుణాలను మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకొని, సమయానికి తిరిగి చెల్లించాలి. రుణాలతో పాటు మహిళలకు చైతన్యం కల్పిస్తూ సేవా కార్యక్రమాలు కూడా నిర్వహించాలి" అని సూచించారు.తరువాత ఆరుగురు మహిళలకు రుణాల చెక్కులను ఎమ్మెల్యే స్వయంగా పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఏరియా మేనేజర్ వెంకటేష్, బ్రాంచ్ మేనేజర్ నరేష్, సపోర్టింగ్ మేనేజర్ మాణిక్యం, మున్సిపల్ చైర్మన్ సునీంద్ర కుమార్, వైస్ చైర్మన్ బాదం రమేష్, కౌన్సిలర్లు శ్రీనివాసులు, శంకర్, సింధు, చంద్రకళ, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు రాజ్ కుమార్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులుతో పాటు పలువురు నాయకులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## అనుమతులు లేకుండా నడుపుతున్న సిరి దంత వైద్యశాల సీజ్

**అమ్రాబాద్, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణ కేంద్రంలో అనుమతులు లేకుండా నడుస్తున్న సిరి దంత వైద్యశాలను డిఎంహెచ్‌ఓ రవికుమార్ గురువారం అకస్మిక తనిఖీల్లో సీజ్ చేశారు. పట్టణంలోని మెడికల్ షాపులు, ఆసుపత్రులను పరిశీలించిన ఆయన, ప్రభుత్వ అనుమతి లేకుండా నిబంధనలను ఉల్లంఘిస్తూ వైద్యశాలను నడపడం తగదని హెచ్చరించారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన



చర్యలు తప్పవని స్పష్టం చేశారు.తనిఖీ సందర్భంగా ఏరియా ఆసుపత్రిని కూడా సందర్శించి, రోగులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని, మెరుగైన వైద్య సహాయం అందించాలని వైద్య బృందానికి ఆదేశాలు ఇచ్చారు. అనుమతులు లేకుండా నడుస్తున్న ఆసుపత్రులపై చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేశారు.

## ప్రమాదకరంగా మారిన రోడ్లు - భయాందోళనలో ప్రజలు

**అమ్రాబాద్, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో రోడ్లు ప్రమాదకరంగా మారి కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.కాలనీలోని పీజీఆర్ హోల్సేల్ రిటైల్ సారీస్ అండ్ టెక్స్‌టైల్స్ ముందు రాత్రి సమయంలో ప్రయాణించడం కష్టసాధ్యమైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై నీరు నిల్వ ఉండడం వల్ల అపరిశుభ్రత పెరిగి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వారు తెలిపారు. అదనంగా



గుంతలు పడిపోవడంతో వాహనదారులు ప్రమాద భయంతో ఉన్నారని పేర్కొన్నారు.ఈ సమస్యపై పలుమార్లు మున్సిపాలిటీ అధికారులకు వినతిపత్రాలు అందించినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని కాలనీవాసులు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లను మరమ్మతు చేసి ప్రజలకు ఉపశమనం కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.కాలనీవాసుల భయాందోళనను నివారించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్రజాసంక్షేమమే ఎమ్మెల్యే మల్ రెడ్డి లక్ష్యం

-కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మార సురేష్
-మండలంలోని తాగునీటి సౌకర్యాల కొరకు 24.90 లక్షల నిధులు మంజూరు



**మంచాల మే 14( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ప్రజల సంక్షేమమే ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి లక్ష్యమని నియోజకవర్గ అభివృద్ధి కొరకు ప్రజల సంక్షేమం ఆయన సంకల్పం గొప్పది అని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మార సురేష్ అన్నారు గురువారం రోజున ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో డీఎంఎఫ్టీ నిధుల నుండి మంచాల మండలంలో నూతన బోర్ వెల్, నూతన మోటార్లు మరియు పైప్ లైన్ తదితర తాగునీటి సౌకర్యాల కొరకు 24.90లక్షల రూపాయల నిధులు మంజూరు కావడం జరిగిందని అన్నారు మండలంలోని నోముల 4.00లక్షలు లోయపల్లి 5.00లక్షలు ఆంబోత్ తండా 3.00లక్షలు ఆరుట్ల 4.00లక్షలు సత్తి తండా 3.90లక్షలు ఆగపల్లి 5.00లక్షలు గ్రామాలకు మంజూరు కావడం జరిగిందని అన్నారు ఎమ్మెల్యే సహకారంతో అన్ని గ్రామాల్లో అభివృద్ధి శరవేగంగా జరుగుతుందని తెలిపారు

# పవర్ ట్రాక్ ట్రాక్టర్ షోరూమ్ ప్రారంభోత్సవం



**నందికొట్కూరు, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నందికొట్కూరు పట్టణంలోని మార్కెట్ యార్డ్ ఎదురుగా జీకే కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పవర్ ట్రాక్ ట్రాక్టర్ షోరూమ్ గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. టీడీపీ నాయకుడు, నాగలూటీ గ్రామానికి చెందిన గ్రామ రవీంద్ర బాబు ఆహ్వాన మేరకు జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నందికొట్కూరు శాసనసభ్యుడు గిత్త జయసూర్య హాజరై ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు, రైతులు, వ్యాపారులు పాల్గొని కొత్త షోరూమ్ ప్రారంభాన్ని అభినందించారు. కార్యక్రమంలో నందికొట్కూరు మండల కన్వీనర్ మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి, పట్టణ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

# తిరుపాటి జంమ్ములయ్య పార్థివ దేహానికి నివాళులు




**నందికొట్కూరు, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నందికొట్కూరు మండలం అల్లూరు గ్రామానికి చెందిన ఆశావర్కర్ శ్యామలమ్మ భర్త తిరుపాటి జంమ్ము లయ్య అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గిత్త జయసూర్య, సీనియర్ నాయకుడు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డిలు పూలమాల వేసి ఆయన పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. తరువాత సున్నంపల్లి శ్రీనివాసులు, కురువ వెంకటేశ్వర్లు, మాండ్ర పురుషోత్తం రెడ్డి, నాగేంద్ర, కృష్ణ, మద్దిలేటి, ఏసన్న తదితరులు కూడా నివాళులు అర్పించారు.

# హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

**కరీంనగర్, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
శ్రీ విజయదుర్గాదేవి విరాట్ హిందూ సమ్మేళనం నేడు శుక్రవారం సాయంత్రం 6 గంటలకు కార్ఖానా గడ్డ, కిసాన్ నగర్ బస్తీ ఆధ్వర్యంలో సమైక్యత మోడల్ స్కూల్‌లో జరగనుంది. ఈ సందర్భంగా నిర్వాహకులు ఇంటింటికీ కరపత్రాలు పంచి ప్రజలను ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ, "దేశానికి ఆత్మ హిందూ ధర్మం, హిందూ సంస్కృతి, హిందూ సమాజమే. అందువల్ల హిందూ సమాజాన్ని చైతన్యవంతం చేయడానికి ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నాం. కావున హిందూ బంధువులు సకాలంలో హాజరై ఈ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి" అని పిలుపునిచ్చారు.



ఇంటింటా హిందూ సమ్మేళన కరపత్రం పంచుతున్న నిర్వాహకులు

# పీఎంజే జ్యువెలరీ దోపిడీ కేసులో అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్




**కరీంనగర్, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని 2 టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఉన్న పీఎంజే జ్యువెలరీ షాప్‌లో మే 3న జరిగిన భారీ దోపిడీ కేసులో అంతర్రాష్ట్ర దోపిడీ ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనలో 161.4 తులాల బంగారు ఆభరణాలు, 112 క్యారెట్ల వజ్రాభరణాలు కలిపి రూ.82 లక్షల 2 వేల విలువైన ఆభరణాలు దోచుకెళ్లగా, నలుగురు సిబ్బంది గాయపడ్డారు. ఈ ఆపరేషన్‌ను ప్రస్తుతం బీహార్ జైలులో ఉన్న గ్యాంగ్ హ్యాండ్లర్, "ది గోల్డెన్ థీఫ్"గా పేరొందిన సుభోద్ సింగ్ ప్రణాళికాబద్ధంగా నిర్వహించినట్లు విచారణలో తేలింది. ప్రధాన నిందితుడు రఘునాథ్ కర్మాకర్ ఏ జగీరా సింగ్ను మే 13న వెలిచాల ఎక్స్ రోడ్ వద్ద అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు నిందితులు రవీష్ కుమార్ ఏ ప్రద్యుమన్, మెహతాబ్ ఖాన్లను బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అదుపులోకి తీసుకుని ట్రాన్సిట్ వారెంట్‌పై కరీంనగర్‌కు తీసుకువచ్చారు. విచారణలో ఈ ముఠా బీహార్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, తెలంగాణ, మహారాష్ట్ర రాష్ట్రాల్లో జ్యువెలరీ షాపులు, బ్యాంకులను లక్ష్యంగా చేసుకుని దోపిడీలు నిర్వహిస్తున్నట్లు బయటపడింది. నకిలీ ఆధార్ కార్డులు, నకిలీ బైక్ నంబర్ ప్లేట్లు, తప్పుడు పేర్లతో లాడ్జ్‌లలో బస చేయడం, ఆధునిక సాంకేతికత వినియోగించడం వంటి పద్ధతులతో ఆయుధాలతో దోపిడీలు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. దోపిడీ రోజున నిందితులు ధర్మపురిలో లాడ్జ్ ఖాళీ చేసి, బైక్ నంబర్ ప్లేట్లు మార్చి, వెలిచాల ఎక్స్ రోడ్ వద్ద ప్రణాళికను మరోసారి చర్చించి, ఉదయం 10:50 గంటలకు షాప్‌లోకి ప్రవేశించారు. సిబ్బంది ప్రతిఘటించడంతో ఆయుధాలతో కాల్పులు జరిపి, ఒక ఆభరణాల బ్యాగ్‌తో పారిపోయారు. మరో బ్యాగ్‌ను షాప్‌లో వదిలివెళ్లారు. సాంకేతిక నిఘా ఆధారంగా ఇప్పటివరకు 13 మంది నిందితులను గుర్తించగా, ముగ్గురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.51,000 నగదు, మొబైల్ ఫోన్లు, నకిలీ ఆధార్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన నిందితుల కోసం ఐదు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. కరీంనగర్ పోలీసులు బ్యాంకులు, జ్యువెలరీ షాపులు, లాడ్జిలు, గెస్ట్ హౌస్ యజమానులు సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయడం, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులను అప్రమత్తంగా ఉంచడం, అనుమానాస్పద వ్యక్తులపై వెంటనే సమాచారం ఇవ్వడం, సరైన ఐడీ ధృవీకరణ తర్వాత మాత్రమే గదులు ఇవ్వడం, నగదు--బంగారం రవాణా సమయంలో భద్రతా నియమాలు పాటించడం, ఎమర్జెన్సీ అలారం వ్యవస్థలు ఏర్పాటు చేయడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# ఎస్సీ,ఎస్టీ ఎట్రాసిటీ చట్టాన్ని నీరుగార్చే సుప్రీం తీర్పు ఆందోళనకరం



**హాలియా, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎస్సీ,ఎస్టీ ఎట్రాసిటీ చట్టంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తాజా తీర్పు ఆ చట్టాన్ని నీరుగార్చేలా ఉందని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవిపిఎస్) జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం హాలియాలో ఆయన ప్రకటన విడుదల చేస్తూ, "దళితులు, గిరిజనులపై అఘాయిత్యాలు పెరుగుతున్న సమయంలో ఈ తీర్పు రావడం పెత్తందారులకు సంతోషకరం, బాధితులకు ఆందోళనకరం" అని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పులో కులదూషణ సంఘటన ప్రజా ప్రదేశంలో జరగాలని, ప్రజల దృష్టికి అందుబాటులో ఉండాలని పేర్కొనడం దళితుల హక్కులను ప్రతికూలంగా ప్రభావితం చేస్తుందని ఆయన విమర్శించారు. "ఇళ్లు, కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు వంటి ప్రదేశాల్లో అవమానాలు, దూషణలు పెరిగే ప్రమాదం ఉంది. నేరస్థులు శిక్షార్హత నుండి తప్పించుకోవచ్చని నమ్మే పరిస్థితి ఏర్పడుతుంది" అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని ఈ తీర్పును పునఃపరిశీలించాలని సుప్రీంకోర్టుకు అప్పీల్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ తీర్పుపై అన్ని రాజకీయ పార్టీలు, దళిత--గిరిజన సంఘాలు, అభ్యుదయవాదులు స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు దైద శ్రీను, కమిటీ సభ్యులు దొంతల నాగార్జున, దోరెపల్లి మల్లయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అభయాంజనేయ స్వామి అనుగ్రహం పొందాలి

-- మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్



**దేవరకొండ, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రతి ఒక్కరూ అభయాంజనేయ స్వామి అనుగ్రహం పొందాలని, భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. గురువారం దేవరకొండ మండలం గన్యానాయక్ తండాలో జరిగిన శ్రీశ్రీశ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, "దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుంది. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి" అని ఆయన సూచించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్, బీఆర్ఎస్ మాజీ మండల పార్టీ అధ్యక్షుడు టివి ఎన్. రెడ్డి, స్థానిక సర్పంచ్ నేనావత్ గోపాల్ నాయక్, రామావత్ తులిసీరామ్, బొడ్డుపల్లి కృష్ణ, నేనావత్ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# 50వ దీక్షకు అశోక రత్నం సంఘీభావం



**నందికొట్కూరు, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
శ్రీశైలం ముంపు బాధితులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 50వ రోజుకు చేరుకున్న సందర్భంగా సీనియర్ రాజకీయ నాయకుడు, విద్యావేత్త అశోక రత్నం బాధితులను పరామర్శించి సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ, "పోతిరెడ్డిపాడు ప్రాజెక్ట్, ముచ్చుమర్రి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 8 లక్షల హెక్టార్ల భూమికి సాగునీరు, కోటి మందికి తాగునీరు, 1470 మెగావాట్ల విద్యుత్ లాభం రాష్ట్రానికి అందుతోంది. ఇవన్నీ శ్రీశైలం ముంపు బాధితుల త్యాగ ఫలితాలే" అని గుర్తు చేశారు. 98 జీవోను అమలు చేసి బాధితులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంపై బైరెడ్డి శభరమ్మ, బైరెడ్డి రాజశేఖర్ రెడ్డితో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఇప్పటివరకు 32 మంది బాధితులు ఆత్మహత్యలు చేసుకున్నారని విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిళా నాయకురాలు సాలమ్మ మాట్లాడుతూ, "మాకు న్యాయం చేసి ఉద్యోగాలు ఇస్తే మీకు రుణపడి ఉంటాం" అని అన్నారు. బాధితులు ఉద్యోగాలు వచ్చేవరకు దీక్షలు కొనసాగిస్తామని జయన్న స్పష్టం చేశారు. 50వ రోజు దీక్షలో సాలమ్మ, రాణి, యశోధ, శ్యామలమ్మ, రమాదేవి, రాజేశ్వరి, నాగసుంకన్న రాజారావు, నాగేంద్రుడు, మురళి, స్వామి నాగన్న, జమ్మన్న, మక్బుల్, పఠాన్ సాహేబ్ ఖాన్, జయన్న తదితర 40 మంది సభ్యులు పాల్గొన్నారు.

# ఒక్కటే జెండా, ఓకే నాయకుడు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి



**కర్నూలు, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అక్రమ అరెస్టులు, కక్ష సాధింపు చర్యలకు వైఎస్సార్సీపీ శ్రేణులు భయపడబోవని రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం కర్నూలు గాంధీ విగ్రహం ముందు జరిగిన మహాధర్నాలో ఆయన మాట్లాడుతూ, "గెలిచినా, ఓడినా ఒక్కటే జెండా వైఎస్సార్సీపీ, ఒక్కటే నాయకుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి" అని ఘోషించారు. వైఎస్సార్సీపీ కర్నూల్ టౌన్ యువజన విభాగం అధ్యక్షుడు బాలుపై కక్షతో అక్రమ అరెస్టులు జరగడం, బెదిరింపులు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన విమర్శించారు. "నన్ను నోరు అదుపులో పెట్టుకోమని అన్నవారికి చెబుతున్నాను... నేను తండ్రి పేరు చెప్పుకొని రాజకీయాల్లోకి రాలేదు. తండ్రి సంపాదించిన అక్రమాస్తులను అడ్డంగా పెట్టుకుని రాజకీయాలు చేయలేదు. ఎన్నికల ముందు కోట్ల రూపాయలు పోసి రాజకీయాల్లోకి రాలేదు" అని వ్యాఖ్యానించారు. అమాయకులపై ఫాక్షన్ రాజకీయాలు చేస్తే తిరిగి అది కూటమి నాయకులకే ప్రతిఫలిస్తుందని హెచ్చరించారు. ఈ మహాధర్నాలో కర్నూలు జిల్లా మాజీ ఎమ్మెల్యే ఎస్.వి. మోహన్ రెడ్డి, ఉమ్మడి కర్నూలు జిల్లా వైసీపీ శ్రేణులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, వైయస్ జగన్మోహన్ రెడ్డి అభిమానులు, బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించిన సర్పంచ్ దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి

**తలకొండపల్లి, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడిబాట కార్యక్రమం గురువారం పడకల్ గ్రామంలో నిర్వహించారు. ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బడిబాటను ప్రారంభించారు. తరువాత ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి గ్రామంలో నినాదాలు చేస్తూ పర్యటించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, "బడి ఈడు పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలలో చేరాలి. విద్యతోనే ఆర్థిక పరిపుష్టి సాధించవచ్చు. పేదరిక నిర్మూలనతో పాటు ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు. సమాజంలో కీర్తి, ప్రతిష్టలు పొందవచ్చు. నేటి సమాజంలో డబ్బుతో కొనలేనిది విద్య ఒక్కటే" అని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జీనుకుంట్ల రాఘవేందర్, స్కూలు ప్రధానోపాధ్యాయులు రాందాస్, శ్రీనివాస్, స్కూల్ చైర్మన్ స్వాతి, వార్డ్ సభ్యులు జోగు విజయ్, జల్లెల సుహాసిని, లత్తుపల్లి వసంత, అబ్దుల్ వాజీద్, బండగల్ల చందు, బూరిగాళ్ల రాధిక, చౌటి విమల, జెనిగే నర్సింహా, చౌటి విజయ్, కాంగ్రెస్ నాయకులు తుళ్ళ తిరుపతి, బషీర్, లక్ష్మినారాయణ, సత్తాయ, మహేష్, యాదయ్య, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లట్టుపల్లి జగ్గారెడ్డి, మాజీ సర్పంచ్ చౌటి రమేష్, గ్రామ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.




# సాంఘిక సంక్షేమ శాఖ సమస్యల పరిష్కరించండి

- మంత్రి పొంగులేటికి వినతి



**ఖమ్మం, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ఉమ్మడి జిల్లాల సమీక్షా సమావేశానికి హాజరైన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి సాంఘిక సంక్షేమ శాఖ మినీస్టీరియల్ ఉద్యోగులు వినతి పత్రం అందజేశారు. వారు ఏండ్లుగా పరిష్కారం లేని సమస్యలను వివరించి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారుల పోస్టులు, కొత్త సూపరింటెండెంట్ పోస్టులు, అదనపు సీనియర్ అసిస్టెంట్ పోస్టులు, ప్రమోషన్లలో 50% రిజర్వేషన్, జూనియర్ అసిస్టెంట్ కం టైపిస్టుల డిజిగ్నేషన్ మార్పు వంటి డిమాండ్లు చేశారు. అలాగే, పదోన్నతుల్లో ఏఎస్‌డబ్ల్యూ ఓలు--సూపరింటెండెంట్లకు 1:1 లేదా 3:2 రేషియో ప్రకారం అవకాశాలు కల్పించాలని కోరారు. సమస్యలను ఆసాంతం విన్న మంత్రి సానుకూలంగా స్పందించారు. ఉద్యోగులు తమ సమస్యలు త్వరగా పరిష్కారం పొందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ వెక్కిరాల, అస్లాం ఖాన్, మొహమ్మద్ ఫాతిమా, పోకల రాకేష్, తంగేళ్లపల్లి వెంకటేశ్వర్లు, మద్దిన్ని విజయలక్ష్మి, రవికిరణ్ శాంతం, కళ్యాణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఎలిగేడులో పదవ తరగతి విద్యార్థులకు సన్మానం

**ఎలిగేడు, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఇటీవల జరిగిన పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన జడ్పీహెచ్ఎస్ ఎలిగేడు విద్యార్థులను గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తాటికొండ సంకీర్తన (512 మార్కులు) ప్రథమ స్థానం, భోగి వెంకటతేజ (485) ద్వితీయ స్థానం, సీహెచ్ కృష్ణ (481) తృతీయ స్థానం సాధించారు. వారితో పాటు ఇతర ప్రతిభావంతులైన విద్యార్థులను సర్పంచ్ కప్పల ప్రవీణ్ ఆధ్వర్యంలో శాలువాలు కప్పి సత్కరించారు. పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేసిన హెడ్‌మాస్టర్ గంద్ర దేవేందర్ రావుతో పాటు ఉపాధ్యాయులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ముంజం నరేశ్, పంచాయతీ కార్యదర్శి అంజలి, వార్డు సభ్యులు కార్తీక్, రాకేశ్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


విద్యార్థులను సన్మానిస్తున్న సర్పంచ్ కప్పల ప్రవీణ్ ఉప సర్పంచ్ ముంజం నరేష్

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

**ఎలిగేడు, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో విద్యా వారోత్సవాల భాగంగా ఎలిగేడు, ధూళికట్ట గ్రామాల్లో జడ్పీహెచ్ఎస్ పాఠశాలల ఆధ్వర్యంలో బడిబాట ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి, ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న నాణ్యమైన విద్యాభోధన, సౌకర్యాలు గురించి వివరించారు. చిన్నారులందరూ ప్రభుత్వ పాఠశాలల్లో చేరి విద్యను అభ్యసించాలని ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచులు కప్పల ప్రవీణ్, కొమురయ్య, హెడ్‌మాస్టర్లు దేవేందర్ రావు, బిజిలి సదయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఎలిగేడులో బడిబాట ర్యాలీ

# ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు కృషి

- సర్పంచ్ కప్పల ప్రవీణ్



అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ కప్పల ప్రవీణ్ ముంజం నరేష్

**ఎలిగేడు, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నానని సర్పంచ్ కప్పల ప్రవీణ్ తెలిపారు. ఎలిగేడు మండల కేంద్రంలోని 10వ వార్డులో జీపీ నిధులతో రూ.2 లక్షల వ్యయంతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, "గ్రామ ప్రజలకు శుభ్రమైన వాతావరణం, సౌకర్యవంతమైన జీవన ప్రమాణాలు కల్పించడమే మా లక్ష్యం. అభివృద్ధి పనులు నిరంతరంగా కొనసాగుతాయి" అని సర్పంచ్ ప్రవీణ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ముంజం నరేశ్, వార్డు సభ్యులు పల్లె కార్తీక్, న్యాతరి పోచాలు, నరేందర్, మధు, శ్రీధర్, సాయి, నాయకులు బుర్ర శ్రీనివాస్, బండ రమేష్, శ్రీధర్, తిరుపతి, సుమన్, వెంకటేశ్, గుండా తిరుపతి, అశోక్, లచ్చన్న, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల శ్రేయస్సు కోసమే కొనుగోలు కేంద్రం



**ఆమనగల్లు, మే 14 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** రైతుల సమస్యను పరిష్కరించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని మార్కెట్ యార్డు ఆవరణలో మార్కెట్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు తాళ్ళ రవీందర్, జెల్ల రమేష్ గౌడ్ లతో కలిసి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైస్ మిల్లర్ల యజమానులు రైతులు ట్రాన్స్ పోర్ట్ వారితో కలిసి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గీత నర్సింహా మాట్లాడుతూ.. రైతులు మధ్య దళారులను ఆశ్రయించవద్దని ఆయన కోరారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దకు తేమశాతంతో కూడిన వరి ధాన్యాన్ని తీసుకువచ్చి క్వింటాలు కు సన్న రకం మద్దతు ధర రూ, 2389, దొడ్డు రకం రూ. 2369 మద్దతు ధర పొందాలని ఆయన సూచించారు. అదేవిధంగా ప్రభుత్వం రూపాయల 500 బోనస్ అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలని ప్రాథమిక సహకార సంఘం అధికారులను ఆయన ఆదేశించారు. ఏవైనా సమస్యలు ఉన్న తన దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

# రైతులకు ఇబ్బందులు లేకుండా వేగంగా ధాన్యం కొనుగోలు చేయాలి

-- ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్



**దేవరకొండ, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ రైతుల ప్రయోజనాలను కాపాడేలా కొనుగోళ్లు వేగవంతం చేయాలని సూచించారు. వినియోగదారుల వ్యవహారాల, ఆహార ౘ పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి జిల్లా ఇంచార్జ్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ, "రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను మిషన్ మోడ్‌లో వేగవంతం చేయాలి. గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూడాలి. రవాణాకు ఆటంకం లేకుండా లారీలను అందుబాటులో ఉంచాలి. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉండాలి" అని సూచించారు. ప్రతి ఐకేపీ సెంటర్, రైస్ మిల్లుల్లో పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని, కొనుగోళ్లలో జాప్యం లేదా నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. "అన్నదాతల ప్రయోజనాలే పరమావధి. ప్రభుత్వం ప్రతి గింజను మద్దతు ధరతో సేకరించేందుకు కట్టుబడి ఉంది. రైతులకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉంది" అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# తాడూర్ కేజీవీబీ హాస్టల్ చేర్పు కోసం బడిబాట

**తాడూర్, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా తాడూర్ కేజీవీబీ ఉపాధ్యాయులు, స్పెషల్ ఆఫీసర్ ఎం. విజయ, హెడ్ మాస్టర్ అనిల్ కుమార్, సిబ్బంది గ్రామంలో ప్రచారం నిర్వహించారు. "బడి ఈడు పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలలో చేరాలి" అని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. కేజీవీబీ తాడూర్‌లో 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్మీడియట్ ఎంపిహెచ్‌డబ్ల్యులో 40, సీఈసీలో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లాలో ఉత్తమ ఫలితాలు సాధించిన పాఠశాలగా గుర్తింపు పొందిన తాడూర్ కేజీవీబీ, ప్రైవేట్ కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా నిలుస్తుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు, ఉపాధ్యాయులు, హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.





# రాచాలపల్లిలో కలెక్టర్ పర్యటన



**ఊరుకొండ, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పటేల్ రాచాలపల్లి గ్రామంలో రైతులతో ముఖాముఖి జరిపారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించే ముందు తేమ శాతం తప్పనిసరిగా పరిశీలించాలని రైతులకు సూచించారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉంటే 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని కలెక్టర్ భరోసా ఇచ్చారు. మధ్యవర్తులపై ఆధారపడకుండా నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకురావాలని సూచించారు. ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి మాట్లాడుతూ, "ప్రతి గింజను ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తుంది. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు" అని అన్నారు. తరువాత గుడిగాని పల్లి గ్రామంలో శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాన్ని తొలగించి కొత్త భవనం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

## ప్రమాదకర విద్యుత్ స్తంభాలు సరిచేయాలని ఏఈకు వినతి





**పెద్దపల్లి, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి పట్టణంలోని 9వ వార్డు చైతన్య కాలనీలో ప్రమాదకరంగా వంగిపోయిన విద్యుత్ స్తంభాలను తక్షణమే సరిచేయాలని విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్‌కు వినతిపత్రం సమర్పించినట్లు బీజేపీ కార్యకర్త బొల్లం అనిల్ కుమార్ తెలిపారు. పట్టణంలోని చైతన్య కాలనీ రోడ్ నంబర్--1, రోడ్ నంబర్--2 ప్రాంతాల్లో ఉన్న పలువురు విద్యుత్ స్తంభాలు తీవ్రంగా వంగిపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ స్తంభాలు ఏ క్షణంలోనైనా కూలిపోయే ప్రమాదం ఉన్నందున ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రస్తుతం వేసవి కాలంలో అకస్మాత్తుగా వీచే ఈదురు గాలులు, వడగళ్ల వానల కారణంగా స్తంభాలు కూలిపోయే అవకాశముందని, తద్వారా ప్రాణ నష్టం, ఆస్తి నష్టం సంభవించే ప్రమాదం ఉందని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోకముందే విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి, వంగిపోయిన స్తంభాలను మరమ్మతులు చేసి ప్రజల భద్రతకు చర్యలు తీసుకోవాలని బొల్లం అనిల్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

## ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



**ఆమనగల్లు, మే 14 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ గోలీ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం వెల్దండ మండలం ఉబ్బల గట్టు తాండ గ్రామపంచాయతీ పరిధిలోని జానలా గడ్డ తాండలో తుల్జా భవానీ గుడి నిర్మాణానికి రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి 25,000 రూపాయలు, బీఆర్ఎస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు నాగులు నాయక్ 10,000/- రూపాయలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ వెల్దండ మండల అధ్యక్షులు పుట్ట రాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, జిల్లా నాయకులు నాగులు నాయక్, జోగయ్య, మాజీ ఎంపీటీసీ జ్యోతి నిరంజన్, చెరుకూరు సర్పంచ్ శ్రీనివాసులు, మాజీ ఉప సర్పంచ్ నిరంజన్, మాజీ సర్పంచ్ సాజ్యా నాయక్, శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ అంజి నాయక్, కొమ్ము నాగయ్య, అశోక్, అంజి మాస్టర్, శంకర్, ప్రవీణ్, గోప్య, హనుమతు, రాగ్య, లాలు, తావుర్య, సూర్య, సుమన్, శ్రీను వార్డు సభ్యులు ఆనంద్, రమేష్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎల్.హెచ్.ఎం.ఎస్ యాప్‌తో మీ ఇంటికి రక్షణ






**నంద్యాల, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నంద్యాల పట్టణంలో దొంగతనాల నివారణకు, ప్రజల ఆస్తులకు భద్రత కల్పించేందుకు 'లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్.హెచ్.ఎం.ఎస్)' అనే వినూత్న కార్యక్రమాన్ని రేపటి నుండి ప్రారంభిస్తున్నట్లు అడిషనల్ ఎస్పీ కుమారి ఎం. జావళి ఆల్ఫోన్స్, ఐపీఎస్ ప్రకటించారు. ఈ యాప్ ద్వారా ప్రజలు తమ ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే సమయంలో 'వాచ్ రిక్వెస్ట్' పంపితే, పోలీస్ కంట్రోల్ రూమ్ సిబ్బంది ఇంటి వద్ద ఉచితంగా అధునాతన సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేస్తారు. మోషన్ డిటెక్షన్ సెన్సార్లతో పనిచేసే ఈ కెమెరాలు ఏ చిన్న అలజడి జరిగిన వెంటనే పోలీసులకు అలర్ట్ పంపుతాయి. యాప్ అందుబాటులో లేని వారు 9154877890 లేదా 9552300009 వాట్సాప్ నంబర్లకు సమాచారం అందించవచ్చు. విలువైన నగలు, నగదును ఇంట్లో ఉంచకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలని, సొంతంగా సీసీటీవీలు, అలారమ్స్ ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. "ప్రస్తుతం పరిమిత సంఖ్యలో కెమెరాలు ఉన్నందున ముందుగా దరఖాస్తు చేసుకున్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుని పోలీసులకు సహకరించాలి" అని అడిషనల్ ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన ఇండిపెండెంట్ సర్పంచ్



**ఆమనగల్లు, మే 14 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు మండలం అకుతోటపల్లి గ్రామ ఇండిపెండెంట్ సర్పంచ్ న్యాలపట్ల నరేందర్ రెడ్డి, ఉపసర్పంచ్ ఓర్సు శ్రీనివాస్ తో పాటు వార్డు సభ్యులు గురువారం పట్టణ కేంద్రంలోని కళ్యాణి గార్డెన్ ఫంక్షన్ హాల్లో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈమేరకు సర్పంచ్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నియోజకవర్గంలో పెద్ద ఎత్తున చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై, అభివృద్ధిలో భాగస్వాములు కావాలనే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ.. ప్రజాపాలన పనితీరు నచ్చి సర్పంచులు స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన ప్రతి హామీలను అమలు చేసిందన్నారు. గత ప్రభుత్వం పదేళ్లు అధికారంలో ఉండి ఒక్క ఇల్లు ఇవ్వలేదన్నారు. పేదల సంక్షేమానికి సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పత్యానాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, ఆయా మండల అధ్యక్షులు తెల్గమల్ల జగన్, బిచ్యా నాయక్, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, ఆదివాసి రాష్ట్ర నాయకులు కృష్ణ నాయక్, కౌన్సిలర్ అనిత శ్రీనివాస్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖాదర్, బ్లాక్ ఉపాధ్యక్షుడు రమణారెడ్డి, సింగల్ విండో డైరెక్టర్ చేగూరి వెంకటేష్, మాజీ వైస్ ఎంపీపీ నిట్ట నారాయణ, సర్పంచ్లు ప్రశాంతి రవికుమార్, మహేందర్ గౌడ్, రాజు, మాజీ సర్పంచ్, గుర్రం కేశవులు, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, విజయ్ నాయక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, దేవరశెట్టి మహేష్, శేఖర్ గౌడ్, గుండ్రతి కుమార్ గౌడ్ మరియు ఆకుతోటపల్లి వార్డు సభ్యులు శిరీష, విజయ్ కుమార్, షేక్ సాజిద్, బాలయ్య, స్వరూప, కృష్ణయ్య, నర్సింహా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అమర్నాథ్ యాత్రికులకు ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు

**- సూపరింటెండెంట్ డాక్టర్ టి. ఉషారాణి**



**నాగర్‌కర్నూల్, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో అమర్నాథ్ యాత్రకు వెళు_న్న భక్తులకు ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ధృవీకరణ పత్రాలు అందజేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి. ఉషారాణి స్వయంగా యాత్రికులను పరీక్షించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "అమర్నాథ్, కేదార్నాథ్, చార్ ధామ్ యాత్రలకు వెళ్తున్న భక్తులందరికీ పూర్తి స్థాయి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ధృవీకరణ పత్రాలు అందిస్తున్నాం. యాత్రికులు ఆరోగ్య సూచనలను పాటిస్తే ప్రయాణం సాఫీగా సాగుతుంది" అని తెలిపారు. కార్యక్రమంలో జనరల్ ఫిజీషియన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మోనాదేవి, డాక్టర్ నికిత, సహాయ సంచాలకులు సీజే వసంత కుమార్, ఆర్.ఏం.ఓ డాక్టర్ ప్రశాంత్, నర్సింగ్ సూపరింటెండెంట్ మంజుల, పద్మ, హెల్ప్‌డెస్క్ ఇంచార్జ్ టి. యాదగిరి, నర్సింగ్ అధికారులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు కాప్స్ పంపిణీ



**ఆమనగల్లు, మే 14 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు విఠాయిపల్లిలో వీపీఎల్ టోర్నమెంట్ కొనసాగుతుంది. ఈమేరకు బీఆర్ఎస్ పార్టీ ఆగ్రామ అధ్యక్షుడు శంకర్ నాయక్ ఆధ్వర్యంలో గురువారం 120 మంది క్రీడాకారులకు క్యాప్ లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అవార్డు కౌన్సిలర్ అనిత శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. శంకర్ నాయక్ క్రీడాకారులకు సహకారం అందించడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయడానికి ఇలాంటి టోర్నమెంట్లు ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కృష్ణ నాయక్, రామచందర్ తదితరులు ఉన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత



**ఆమనగల్లు, మే 14 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వెల్దండ మండలం చేదురుపల్లి గ్రామానికి చెందిన లింగమ్మ అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి గురువారం లింగమ్మను పరామర్శించి, వైద్య ఖర్చుల నిమిత్తం 5000/- రూపాయలు అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ వెల్దండ మండల అధ్యక్షులు పుట్ట రాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, జిల్లా నాయకులు నాగులు నాయక్, జోగయ్య, మాజీ ఎంపీటీసీ జ్యోతి నిరంజన్, చెరుకూరు సర్పంచ్ శ్రీనివాసులు, మాజీ ఉప సర్పంచ్ నిరంజన్, శ్రీనివాస్ రెడ్డి మాజీ సర్పంచ్ అంజి నాయక్, కొమ్ము నాగయ్య, అశోక్, అంజి మాస్టర్, శంకర్, ప్రవీణ్, సుమన్, శ్రీను, వార్డు సభ్యులు ఆనంద్, రమేష్, జంగయ్య, మాజీ ఎంపీటీసీ భీమయ్య, చేర్కూర్ మాజీ ఉప సర్పంచ్ నరసింహా, చెదురుపల్లి సర్పంచ్ దన్సింగ్, ఉప సర్పంచ్ సహదేవ, శివ, రాజు జానీ, మహేష్, డీలర్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## మరిన్ని అద్భుత చిత్రాలు తీయాలి

**- డైరెక్టర్ జయశంకర్**



**ఎలిగేడు, మే 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అరి మూవీ డైరెక్టర్ జయశంకర్ భవిష్యత్తులో మరిన్ని అద్భుత చిత్రాలను తెరకెక్కించాలని ఎలిగేడు గ్రామ సర్పంచ్ కప్పల ప్రవీణ్ ఆకాంక్ష వ్యక్తం చేశారు. స్వగ్రామానికి వచ్చిన సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జయశంకర్ మాట్లాడుతూ, "అరి సినిమాను ఆదరించిన ప్రేక్షకులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. త్వరలో మంచి కుటుంబ కథనంతో కూడిన చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది" అని తెలిపారు. అనంతరం ఆయన సర్పంచ్ ప్రవీణ్‌కు అరి మూవీకి సంబంధించిన బహుమతి అందజేశారు. "నన్ను ఎంతగానో ఆదరించిన ఎలిగేడు గ్రామ ప్రజలకు, స్నేహితులకు ప్రత్యేక కృతజ్ఞతలు" అని డైరెక్టర్ జయశంకర్ పేర్కొన్నారు.

## మే 24న ఎల్బీనగర్ లో బీసీ ప్రభంజనం

**- హాజరుకానున్న మంద కృష్ణ మాదిగ .**
**- వెల్లడించిన ఉప్పు సత్యనారాయణ, జాల కిషన్ ...**





**ఎల్బీనగర్, మే 14(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
బీసీ ప్రభంజనం సభకు హాజరయ్యేందుకు పద్మ శ్రీ మంద కృష్ణ మాదిగ అంగీకరించారని బీసీ ప్రభంజనం కన్వీనర్ ఉప్పు సత్యనారాయణ, సమన్వయకర్త జాల కిషన్ తెలిపారు. బీసీ ప్రభంజనం సభకు హాజరు కావాలని కోరుతు బీసీ ప్రభంజనం కన్వీనర్ ఉప్పు సత్యనారాయణ, బీసీ ప్రభంజనం సమన్వయకర్ రాష్ట్ర నాయకులు జాల కిషన్, ఎస్సీ ఎస్టీ బీసీ జెఎసి కన్వీనర్ తెలంగాణ వెంకన్న గురువారం మంద కృష్ణ మాదిగను కలిసారు. మే 24 న ఎల్బీనగర్ లో జరిగే బీసీ ప్రభంజనం సభకు ప్రముఖ దళిత నాయకులు ఎంఆర్ పిఎస్
వ్యవస్థాపక అధ్యక్షులు పద్మ శ్రీ మంద కృష్ణ మాదిగ ఈ సందర్భంగా సంఘీభావాన్ని ప్రకటించారు. అనంతరం బీసీ ప్రభంజనం కన్వీనర్ ఉప్పు సత్యనారాయణ, జాల కిషన్ లు మాట్లాడుతూ చట్టసభల్లో బీసీలకు రిజర్వుడు స్థానాలు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వద్ద ఉన్న సమాచారం మేరకు అయిన బీసీలకు చట్టసభల్లో రిజర్వుడు స్థానాలు కేటాయించే దిశగా పాలక వర్గాలు చిత్తశుద్ధితో కృషి చేయాలని బీసీ ప్రభంజనం నాయకులు డిమాండ్ చేశారు. సామాజిక చైతన్యం అధికంగా ఉండే తెలంగాణ ప్రాంతంలో జరుగుతున్న బీసీ ఉద్యమానికి ఎంఆర్ పిఎస్ ఎప్పుడూ అండగా ఉండాలని మంద కృష్ణ మాదిగను కోరడం జరిగింది అన్నారు. ఎన్నో సామాజిక ఉద్యమాలకు కేంద్రంగా ఉన్న ఎల్బీనగర్ ప్రాంతంలో జరిగే బీసీ ప్రభంజనం సభకు పద్మ శ్రీ మంద కృష్ణ మాదిగ వంటి జాతీయ నాయకులు హాజరు అయితే బీసీ ఉద్యమానికి భరోసా వస్తుంది అని బీసీ ప్రభంజనం నిర్వాహకులు వివరించారు. ఎవ్వరి జనాభా ఎంత ఉన్నదో అంత మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ, చట్టసభల్లో రిజర్వుడు స్థానాలు ఏర్పాటు చేయాలని బీసీ ప్రభంజనం నేతలు కోరారు. అదే సందర్భంలో రాజ్యాధికారానికి దూరంగా ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ బహుజనులు ఏకం కావాల్సిన అవసరం కూడా ఉందని మంద కృష్ణ మాదిగ కు ఉప్పు సత్యనారాయణ వివరించారు. ఎల్బీనగర్ లో జరిగే బీసీ ప్రభంజనం సభకు ఎంఆర్ పిఎస్ తో పాటు మాదిగ దండోరా అనుబంధ సంఘాలు కదిలి రావాలని జాల కిషన్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. మే 24 న ఎల్బీనగర్ లో నిర్వహించే బీసీ ప్రభంజనం సభ రాజకీయాలకు అతీతంగా జరుగుతుంది అని బీసీ ప్రభంజనం కన్వీనర్ ఉప్పు సత్యనారాయణ, బీసీ ప్రభంజనం సమన్వయకర్త, టియుడబ్ల్యుజె రాష్ట్ర నాయకులు జాల కిషన్, ఎస్సీ ఎస్టీ బీసీ జెఎసి కన్వీనర్ తెలంగాణ వెంకన్న లు మంద కృష్ణ మాదిగ కు వివరించారు. బీసీ వాదాన్ని బలోపేతం చేయడానికి బీసీ ప్రభంజనం సభ దోహదపడుతుంది అని బీసీ ప్రభంజనం సభ నిర్వాహకులు మంద కృష్ణ మాదిగ కు తెలిపారు. మే 24 న ఎల్బీనగర్ ఎస్ కె గార్డెన్స్ లో జరిగే బీసీ ప్రభంజనం సభకు అన్ని రాజకీయ పార్టీల బీసీ నేతలు, బీసీ సంఘాల నాయకులు హాజరు కానున్నారు అని ఆయనకు ఉప్పు సత్యనారాయణ, జాల కిషన్ లు వివరించారు. బీసీ రాజకీయ నాయకులతో పాటు బీసీ విద్యావంతులు మేధావులు బీసీ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొంటారు అని తెలిపారు. బీసీ ప్రభంజనం సభకు సంఘీభావంగా తెలంగాణ దళిత గిరిజన ఎస్సీ ఎస్టీ బీసీ సంఘాల నాయకులు కూడా హాజరు అవుతారు అని ఎస్సీ ఎస్టీ బీసీ జెఎసి కన్వీనర్ తెలంగాణ వెంకన్న తెలిపారు.

# బిజినెస్

## చక్కెర ఎగుమతులపై భారత్ నిషేధం..
# అంతర్జాతీయంగా పెరగనున్న ధరలు

చక్కెర ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ నిషేధం తక్షణమే అమలులోకి వచ్చింది. ఈ ఏడాది సెప్టెంబర్ 30 వరకు అమలులో ఉంటుందని కేంద్రం తెలిపింది. ఈ మేరకు బుధవారం కేంద్రం నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశంలో చక్కెర ధరల్ని నియంత్రించే లక్ష్యంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. చక్కెరతోపాటు చక్కెర ఉత్పత్తి చేసే చెరుకు వంటి ముడి పదార్థాల ఎగుమతుల్ని కూడా కేంద్రం నిషేధించింది.ఇటీవలి కాలంలోచక్కెర ఉత్పత్తి తగ్గిపోతోంది. దీంతో ధరలు పెరుగుతున్నాయి. అందుకే కేంద్రం ఈ అంశంపై స్పందించింది. విదేశాలకు భారత చక్కెర ఎగుమతులు నిలిపివేయడంతో అంతర్జాతీయంగా చక్కెర ధరలు పెరిగే అవకాశాలున్నట్లు మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. చక్కెరతోపాటు, సంబంధిత ముడి పదార్థాల ధరలు కూడా అంతర్జాతీయంగా పెరగొచ్చని అంచనా. ఇదే సమయంలో ఇండియాతోపాటు చమురు ఎగుమతుల్లో కీలకంగా ఉన్న బ్రెజిల్,



థాయ్‌లాండ్ వంటి దేశాలకు మంచి వ్యాపార అవకాశాలు దక్కే ఛాన్స్ ఉంది. భారత చక్కెర లేని లోటుని, ఆ దేశాలు తమ దగ్గర ఉత్పత్తైన చక్కెరను అందించి భర్తీ చేయొచ్చు. దీనివల్ల ఆయా దేశాలకు ఆసియా, ఆఫ్రికా మార్కెట్లలో చక్కెర ఎగుమతులపై మంచి పట్టు దొరికే ఛాన్స్ ఉంది. ప్రపంచంలోనే ఇండియా రెండో అతిపెద్ద చక్కెర ఎగుమతిదారు. ఈ ఏడాది 1.59 మిలియన్ మెట్రిక్ టన్నుల చక్కెర ఎగుమతులకు కేంద్రం అనుమతించింది. ఇదే సమయంలో దేశంలో తగినంత చక్కెర ఉత్పత్తి జరిగి, ఇక్కడ ధరలు అందుబాటులో ఉంటాయని భావించింది. అయితే, పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. చక్కెర ఎక్కువగా పండించే అనేక ప్రాంతాల్లో ఈసారి వాతావరణ మార్పులు సహా వివిధ కారణాలతో దిగుబడి తగ్గింది. దీంతో తగినంతగా చమురు ఉత్పత్తి జరగడం లేదు. మార్కెట్ వర్గాల ప్రకారం.. 8 లక్షల మెట్రిక్ టన్నుల చక్కెర ఉత్పత్తికి ఒప్పందం కుదరగా, 6 లక్షల మెట్రిక్ టన్నులు ఇప్పటికే ఎగుమతి జరిగింది. ఈ నిషేధం తక్షణమే అమలులోకి వచ్చింది. అయితే, ఇప్పటికే లోడింగ్ ప్రారంభమైన వాటికి మాత్రం వర్తించదు.

## జియో ప్లాట్‌ఫామ్స్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఆకాశ్ అంబానీ



భారత వ్యాపార దిగ్గజం ముకేశ్ అంబానీ పెద్ద కుమారుడు ఆకాశ్ అంబానీ ని జియో ప్లాట్‌ఫామ్స్ మేనేజింగ్ డైరెక్టర్ గా నియమించారు. రిలయన్స్ కు చెందిన ఈ డిజిటల్ సేవల సంస్థ ఐపీవోకు వెళ్ళనుంది. ఈ నేపథ్యంలో ఆకాశ్ అంబానీని మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించారు. ఏప్రిల్ 9 నుంచి ఈ నియామకం అందుబాటులోకి వచ్చినట్లు కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. ఐదేళ్ల కాలంపాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారని మే 7న సమర్పించిన ఫైలింగ్ లో పేర్కొన్నది.జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీవోకు సన్నద్ధమవుతున్న వేళ ఈ నియామకం చేపట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ఏడాది మే నెలాఖరున లేదా జూన్ నెలలో ఐపీవోకు సంబంధించిన ముసాయిదా పత్రాలను సెబీకి సమర్పించే అవకాశం ఉంది. టెలికం విభాగమైన రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ బోర్డులో 2014 అక్టోబర్ నుంచి ఆకాశ్ అంబానీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. 2022 జూన్ నెలలో ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆకాశ్ అంబానీ నేతృత్వంలో జియో 2016 లోనే కేవలం ఆరు నెలల వ్యవధిలో 10 కోట్ల మంది సబ్‌స్క్రైబర్లను సొంతం చేసుకుంది. 2026 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.30 వేల కోట్ల నికర లాభాన్ని రూ.1.46 లక్షల కోట్ల ఆదాయాన్ని నమోదుచేసింది.

## భారీ లాభాల్లో స్టాక్ మార్కెట్లు..
# సెన్సెక్స్ 789 పాయింట్లు లాభం

భారతీయ స్టాక్ మార్కెట్లు గురువారం భారీ లాభాల్లో ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 789 పాయింట్లు లాభపడి 75,398.72 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 277 పాయింట్లు లాభపడి 24,689.60 వద్ద ముగిసింది. కొనుగోళ్లు, అంతర్జాతీయ మార్కెట్లు సానుకూలంగా ఉండటంతో మార్కెట్లు లాభాలబాటలో నడిచాయి.సెన్సెక్స్ ఉదయం 74,947 వద్ద ప్రారంభమైంది. ఒక దశలో 75,681 గరిష్ఠ స్థాయికి చేరింది. చివరకు 75,398 వద్ద ముగిసింది. 30 షేర్స్ బీఎస్ఈ ఇండెక్స్‌లో భారతి ఎయిర్‌టెల్, ఎటర్నల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, అదానీ పోర్ట్స్, సన్ ఫార్మా సంస్థలు భారీ లాభాలు గడించాయి. మారుతి, యాక్సిస్ బ్యాంక్, హిందుస్తాన్ యునీలీవర్, టీసీఎస్, హెచ్‌సీఎల్ సంస్థల షేర్లు నష్టపోయాయి. భాతర మార్కెట్లు గత నాలుగు సెషన్లలో 4 శాతం



పైగా నష్టపోయాయి. క్రూడాయిల్ ధరలు పెరిగిన నేపథ్యంలో ఇటీవల ప్రధాని మోదీ.. చమురును జాగ్రత్తగా వాడుకోవాలని సూచించిన నేపథ్యంలో మార్కెట్లపై ప్రతికూల ప్రభావం పడింది. అంతర్జాతీయ మార్కెట్లైన జపాన్ నిక్కీ, దక్షిణ కొరియా కోస్పి, హాంకాంగ్ హాంగ్‌సెంగ్ సూచీలు లాభాల్లో ట్రేడయ్యాయి. భారత మార్కెట్లు లాభాలు చూసినప్పటికీ డాలర్‌తో రూపాయి మార్కెట్ విలువ మాత్రం తగ్గిపోయింది. గురువారం డాలర్‌తో రూపాయి విలువ తగ్గిపోయి 95.73 వద్ద ట్రేడవుతోంది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధర కూడా పెరిగింది. గురువారం బ్యారెల్ క్రూడాయిల్ ధర 0.50 పెరిగి, 106.16 వద్ద కొనసాగుతోంది.

# స్పోర్ట్స్

# బంగ్లాదేశ్ చేతిలో ఘోర ఓటమి..

పాకిస్థాన్ టెస్టు క్రికెట్ జట్టులో పెను మార్పులు చోటుచేసుకోనున్నట్లు సంకేతాలు వెలువడుతున్నాయి. బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో ఎదురైన ఘోర పరాజయం నేపథ్యంలో, ప్రస్తుత కెప్టెన్ షాన్ మసూద్‌ను తొలగించి, ఆ బాధ్యతలను తిరిగి స్టార్ బ్యాటర్ బాబర్ ఆజామ్‌కు అప్పగించాలని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు యోచిస్తోంది. ఢాకాలోని షేర్-ఎ-బంగ్లా స్టేడియంలో బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో పాకిస్థాన్ 104 పరుగుల తేడాతో ఓటమిని చవిచూసింది. 268 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాక్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 163 పరుగులకే కుప్పకూలింది. షాన్ మసూద్ సారథ్యంలో పాకిస్థాన్ ఇప్పటివరకు ఆడిన 15 టెస్టుల్లో ఏకంగా 11 ఓటములను నమోదు చేయడం గమనార్హం. ఒక పాకిస్థాన్ కెప్టెన్‌కు ఇది అత్యంత చెత్త రికార్డుగా నిలిచింది. బ్యాటర్‌గా కూడా మసూద్ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ విఫలమవడంతో (మొదటి ఇన్నింగ్స్‌లో 9, రెండో ఇన్నింగ్స్‌లో 2 పరుగులు), అతనిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మోకాలి గాయం కారణంగా తొలి టెస్టుకు దూరమైన బాబర్ ఆజామ్, మే 18 నుండి ప్రారంభం కానున్న రెండో టెస్టు నాటికి



పూర్తి ఫిట్‌నెస్ సాధించి జట్టులోకి వచ్చే అవకాశం ఉంది. ఇటీవల జరిగిన పాకిస్థాన్ సూపర్ లీగ్ లో పెషావర్ జల్మీని ఛాంపియన్‌గా నిలబెట్టడంతో పాటు, టోర్నీలో అత్యధిక పరుగులు (11 ఇన్నింగ్స్‌ల్లో 588 పరుగులు) సాధించిన ఆటగాడిగా బాబర్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. పీసీబీలోని కీలక వ్యక్తులు బాబర్‌ను తిరిగి కెప్టెన్‌గా నియమించడం ద్వారా జట్టును గాడిలో పెట్టవచ్చని భావిస్తున్నారు. ప్రస్తుత ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ సైకిల్‌లో పాకిస్థాన్‌కు ఇంకా ఏడు టెస్టు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. ఈ కీలక దశలో అనుభవజ్ఞుడైన బాబర్ నాయకత్వమే సరైనదని బోర్డు వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం. కేవలం టెస్టులకే పరిమితం కాకుండా, వచ్చే ఏడాది జరగనున్న వన్డే ప్రపంచకప్ నాటికి బాబర్‌ను వన్డే కెప్టెన్‌గా కూడా సిద్ధం చేయాలని పీసీబీ యోచిస్తోంది. బాబర్ గతంలో 2019 నుండి 2023 వరకు మూడు ఫార్మాట్లలోనూ జట్టుకు నాయకత్వం వహించారు. 2023 ప్రపంచకప్ తర్వాత తప్పుకున్న బాబర్, ఆపై కొద్దికాలం టీ20 కెప్టెన్‌గా తిరిగి వచ్చినా ఆ తర్వాత మళ్ళీ ఆ బాధ్యతల నుంచి వైదొలిగారు. మరోవైపు, షాన్ మసూద్‌కు జట్టులో ఏదైనా పరిపాలనాపరమైన లేదా ఇతర బాధ్యతలు అప్పగించే ఆలోచన కూడా ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న సిరీస్ తర్వాత కెప్టెన్ మార్పుపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. బాబర్ ఆజామ్ రెండో టెస్టులో తన బ్యాటింగ్ ఫామ్‌ను నిరూపించుకుంటే, అతని కెప్టెన్సీ పట్టాభిషేకానికి ఇక అడ్డంకులు ఉండబోవని విశ్లేషకులు భావిస్తున్నారు.


## సన్‌రైజర్స్ హైదరాబాద్
# ప్లేఆఫ్స్ చేరాలంటే



ఐపీఎల్ 2026లో భాగంగా అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియంలో గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ చిత్తు చిత్తుగా ఓడిపోయిన సంగతి తెలిసిందే. 82 పరుగుల తేడాతో ఘోర ఓటమిని చవిచూసింది. ఫలితంగా ఎస్‌ఆర్‌హెచ్ నెట్‌రన్‌రేటు (ం0.331) దారుణంగా పడిపోయింది. ఈ ఓటమితో పాయింట్ల పట్టికలో ప్రస్తుతానికి సన్‌రైజర్స్ హైదరాబాద్ స్థానం మారకున్నా కూడా ప్లేఆఫ్స్ అవకాశాలు మాత్రం కొద్దిగా కష్టంగా మారాయి. మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో గెలవాల్సిన పరిస్థితి ఉంది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు సన్‌రైజర్స్ హైదరాబాద్ 12 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో 7 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. మరో 5 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. ప్రస్తుతం 14 పాయింట్లతో పట్టికలో మూడో స్థానంలో కొనసాగుతోంది. లీగ్ దశలో ఎస్‌ఆర్‌హెచ్ మరో రెండు మ్యాచ్‌లు మే 18న చెన్నైతో, మే22న ఆర్‌సీబీతో ఆడనుంది. అయితే ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా ప్లేఆఫ్స్ బెర్తును ఖరారు చేసుకోవాలంటే.. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు మిగిలిన రెండు మ్యాచ్‌లు.. చెన్నై, ఆర్‌సీబీపై విజయం సాధించాల్సి ఉంటుంది. అప్పుడు సన్‌రైజర్స్ ఖాతాలో 18 పాయింట్లు ఉంటాయి. మెరుగైన రన్‌రేటు కలిగి ఉంటే ఇతర జట్ల సమీకరణాలు కలిసి వస్తే టాప్-2లో కూడా చోటు దక్కించుకోవచ్చు. ఇక మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో ఎస్‌ఆర్‌హెచ్ ఒక్క మ్యాచ్‌లో ఓడిపోయినప్పటికి కూడా ప్లేఆఫ్స్‌కు చేరుకునే అవకాశాలు ఉన్నాయి. అయితే.. అప్పుడు సన్‌రైజర్స్ ఖాతాలో 16 పాయింట్లు ఉంటాయి. అయినా కూడా ఇతర జట్ల ఫలితాలతో పాటు నెట్‌రన్‌రేటుపై ఆధారపడాల్సి ఉంటుంది. ఇందుకోసం నెట్‌రన్‌రేటును మెరుగు పరుచుకోవాల్సి ఉంటుంది. ఇదిలా ఉంటే.. మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓడిపోతే మాత్రం అప్పుడు ప్లేఆఫ్స్ ఛాన్స్ సంక్లిష్టం అవుతుంది. 14 పాయింట్లే ఎస్‌ఆర్‌హెచ్ ఖాతాలో ఉంటాయి. నాలుగో స్థానంతోనైనా ప్లేఆఫ్స్‌లో అడుగుపెట్టే అవకాశం ఉంది. 14 పాయింట్లు సాధించిన మిగిలిన జట్ల కంటే ఎస్‌ఆర్‌హెచ్ రన్‌రేటు మెరుగ్గా ఉండడంతో పాటు మూడు కంటే ఎక్కువ జట్లు ఎస్‌ఆర్‌హెచ్ పాయింట్ల కంటే ఎక్కువగా ఉండకూడదు.

# శార్దూల్ బంతికి బిత్తరపోయిన శ్రేయస్ అయ్యర్

ధర్మశాల స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ ధాటిగా ఇన్నింగ్స్ ప్రారంభించింది. 11 ఓవర్లు ముగిసేసరికి పంజాబ్ ఒక వికెట్ నష్టానికి 107 పరుగులు చేసి పటిష్ట స్థితిలో ఉంది. ఈ దశలో ముంబై తాత్కాలిక కెప్టెన్ జస్ప్రీత్ బుమ్రా, 12వ ఓవర్ వేసే బాధ్యతను శార్దూల్ ఠాకూర్‌కు అప్పగించాడు. ఆ ఓవర్ రెండో బంతికే సెంచరీ దిశగా సాగుతున్న ప్రభ్‌సిమ్రాన్ సింగ్‌ను అవుట్ చేసిన శార్దూల్, ముంబైకి బ్రేక్ ఇచ్చాడు. ప్రభ్‌సిమ్రాన్ అవుట్ అయిన తర్వాత క్రీజులోకి వచ్చిన పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ఎదుర్కొన్న మొదటి బంతికే ఫోర్ కొట్టి శుభారంభం చేశాడు. అయితే ఆ మరుసటి బంతికే శార్దూల్ ఒక అద్భుతాన్ని సృష్టించాడు. గుడ్ లెంగ్త్‌లో పడిన బంతి అనూహ్యంగా స్వింగ్ అవుతూ ఆఫ్ స్టంప్‌ను గిరాటేసింది. ఆ బంతిని అంచనా వేయడంలో అయ్యర్ పూర్తిగా విఫలమయ్యాడు. బంతి వెళ్లిన వేగానికి, ఆ స్వింగ్‌కు అయ్యర్ నోరెళ్లబెట్టాడు. కనీసం బంతి ఎటు నుంచి వచ్చిందో కూడా అర్థం కాక అయోమయంలో ఉండిపోయాడు.అయ్యర్ వికెట్



తీసిన వెంటనే శార్దూల్ ఆనందానికి అవధులు లేవు. మైదానంలో పరుగెత్తుతూ తనదైన శైలిలో సంబరాలు చేసుకున్నాడు. ఒకే ఓవర్లో ఇద్దరు కీలక బ్యాటర్లను అవుట్ చేసి పంజాబ్‌ను కష్టాల్లోకి నెట్టాడు. ఈ వీడియో ఇప్పుడు క్రికెట్ అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. నెటిజన్లు దీనిని "సీజన్ ఉత్తమ బంతి"గా అభివర్ణిస్తున్నారు. కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్‌తో శార్దూల్ చేసిన ఈ ప్రయోగం ముంబై జట్టులో కొత్త ఉత్సాహాన్ని నింపింది.మంచి ఆరంభం లభించినా, శార్దూల్ వేసిన ఆ ఒక్క ఓవర్ పంజాబ్ స్కోరు వేగాన్ని తగ్గించింది. కెప్టెన్ అయ్యర్ తక్కువ పరుగులకే వెనుదిరగడం జట్టుపై ఒత్తిడి పెంచింది. బుమ్రా వ్యూహం పారడంతో ముంబై ఇండియన్స్ మ్యాచ్‌పై పట్టు సాధించింది. ఈ అద్భుతమైన డెలివరీ ఐపీఎల్ చరిత్రలో ఒక ప్రత్యేకమైన వికెట్‌గా నిలిచిపోతుందనడంలో సందేహం లేదు.